మంగళవారం 17 ఫిబ్రవరి 2026

https://www.telugudesam.org

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో...

# ఆంధ్రప్రదేశ్‌కి మహర్దశ

- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నాం
- బిల్‌గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పాలనా విధానాలపై ప్రజెంటేషన్
- కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై గేట్స్ ప్రశంసలు
- డిజిటల్ విప్లవంలో బాబుది కీలక పాత్ర అని కితాబు

2

## హాలో ఫ్రెండ్... హౌ ఆర్ యూ!

3









## ఏపీలో టెక్ పాలన గ్రేట్

- ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్‌గేట్స్ వ్యాఖ్య
- డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన ముఖ్యమంత్రి
- ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తెస్తోందన్న బాబు

ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం ఉదయం ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో కలిసి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని సందర్శించారు.

3

## మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఏవియేషన్ సర్వీసెస్ ప్రారంభం

న్యూఢిల్లీ: విమాన రంగానికి ప్రపంచ స్థాయి నైపుణ్యాల దిశగా కీలక ముందడుగు పడింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్‌ను ప్రారంభించారు. యువ పైలెట్ కేడట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. అట్లాంటా పర్యటన సమయంలో ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నిజంగా రెక్కలు తొడుగుతోందన్నారు. ప్రపంచ స్థాయి ప్రతిభతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగు అన్నారు. విమానయాన భవిష్యత్తుకు కొత్త ఉత్సాహం, దిశ కనిపించిందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.





## అన్నదాతలకు ఏఐ, అగ్రిటెక్ సేవలు

# అత్యద్భుతం

- వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బిల్‌గేట్స్
- సాగులో యాప్, డ్రోన్ల వినియోగం పరిశీలన
- సీఎం చంద్రబాబు, గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం

4

వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు.

చైతన్యరథం

## గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో...

# ఏపీకి కొత్త దశ, దిశ



- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నాం
- బిల్‌గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పాలనా విధానాలపై సీఎం ప్రజెంటేషన్
- కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై బిల్‌గేట్స్ ప్రశంసలు
- డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్ర అని కితాబు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని సీఎం అన్నారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి... ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్‌గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్‌గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానన్నారు. మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా ఉందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని నెం.1 చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది

సమావేశంలో మాట్లాడిన బిల్‌గేట్స్... డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయపడుతుందన్నారు. విద్యా రంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్‌గేట్స్ వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం... టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగంచట్లేదని, కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ బిల్‌గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

### పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 సాకారం

స్వర్ణాంధ్ర 2047 విజన్, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. జీరో పావర్టీ, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, రైతు-అగ్రి టెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ-ఫ్యూయల్, ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్... ఈ పది సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమన్నారు. దీనికి ఆధార్ ధ్రువీకరణ, వ్యక్తిగత, కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్, డిజి వెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. టెక్నాలజీ ఆధారిత థీమాటిక్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే క్వాంటం వ్యాలీ- డిజైన్- ఫౌండ్రీగా అమరావతి, డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయన్నారు. మొత్తం 7 డేటా లెక్ ప్రాజెక్టులు ప్రారంభించామని చెప్పారు.

### 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం

స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్దాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతి వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం' అని సీఎం చెప్పారు.

### విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

విద్యా రంగంలో అనుసరిస్తున్న ఆధునిక విధానాల గురించి కూడా ముఖ్యమంత్రి స్పష్టంగా తెలియజేశారు. ఇందుకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపైనా సంతోషం వ్యక్తం చేశారు. లిటరసీ-న్యూమరసీపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి పెట్టిందన్నారు. 35వేల పాఠశాలల్లో చదువుతున్న 13.4 లక్షల విద్యార్థులకు ఉపకరించేలా ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నామని వివరించారు. ఏఐ ద్వారా సాగుకు సలహాలు అందించడమే కాకుండా, డ్రోన్లు సహా వ్యవసాయ యంత్రాలను అద్దెప్రాతిపదికన వినియోగించుకునేలా అందుబాటులో ఉంచామన్నారు. తెగుళ్లు, చీడపీడలపై ముందస్తు హెచ్చరికలు చేయడం ద్వారా రైతులు నష్టపోకుండా కాపాడటం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు. గోధార్ ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణ చేపట్టామన్నారు. విద్యుత్-పశుగ్రాసం వినియోగంలో వృధాను తగ్గించగలిగామని చెప్పారు. భూసార పరీక్షలు, మార్కెట్ సలహాలు, సమర్థ నీటి నిర్వహణ సాగులో పెనుమార్పులు తీసుకువస్తున్నామని వివరించారు.

### జూలైకల్లా రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

వైద్య రంగంలో తెచ్చిన మార్పులు-సాధించిన ఫలితాలను బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. హై లెవెల్ ఎక్స్‌పర్ట్ అడ్వైజరీ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. డబ్ల్యుహెచ్‌వో, అశోకా యూనివర్సిటీ సహకారంతో నేషనల్ హెల్త్ ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్, ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) అమలు సహా తక్కువ ఖర్చుకే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 71 లక్షల మందికి 41 పరీక్షల ద్వారా స్క్రీనింగ్ పూర్తి చేశామని చెప్పారు. 'సంజీవని' కార్యక్రమాన్ని సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కుప్పంలో ఇప్పటికే సంజీవని పైలట్ ప్రాజెక్టు చేపట్టగా విజయవంతమైందన్నారు. 2.9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయగా 109 ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 5.2 కోట్ల ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జూలై 2026 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను ఇవ్వాలనేది రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీబీ రోగులకు పోషకాహారం అందిస్తున్నామని, ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో డీఎంఐడీసీ స్థాపించామన్నారు. ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టుగా 'అమరావతి స్కూల్ ఆఫ్ బయోడిజైన్' చేపట్టామన్నారు.

### బిల్‌గేట్స్‌తో మంత్రుల ఇంటరాక్షన్

బిల్‌గేట్స్ పలు అంశాలపై మంత్రులను ప్రశ్నించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు కారణమేంటని మంత్రి పయ్యావుల కేశవ్ అడగ్గా..... దీనికి బిల్‌గేట్స్ ఆసక్తికర సమాధానం చెప్పారు. నాడు చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారన్నారు. అదే సమయంలో చంద్రబాబు మైక్రోసాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టారని బిల్‌గేట్స్ తెలిపారు. దీనిపై తమ వద్ద పనిచేసే వారి అభిప్రాయం కోరితే... హైదరాబాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారని వివరించారు. ఇప్పుడు కూడా భారతదేశంలో మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో పని చేసే చాలా మంది ఉద్యోగుల్లో హైదరాబాద్ వారే ఎక్కువగా ఉన్నారన్నారు. ఏఐ ద్వారా ఆరోగ్య సేవలు ఏ విధంగా అందించవచ్చని బిల్ గేట్స్‌ను మంత్రి సత్యకుమార్ అడిగారు. ఏఐ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించవచ్చని... నాణ్యమైన, నిపుణుల వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు కూడా అందించే అవకాశం ఉంటుందని గేట్స్ వెల్లడించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా... ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.

# ఏపీలో టెక్ పాలన గ్రేట్!

●ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్‌గేట్స్ వ్యాఖ్య ●డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించిన సీఎం ●ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తెస్తోందన్న బాబు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం ఉదయం ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో కలిసి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ డిస్‌ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజెంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ విభాగాలనూ అనుసంధానించామని... తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్‌గేట్స్‌కు డిస్‌ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించడం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని... ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్‌గేట్స్ పౌరసేవలను సులభతరం చేయడం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలోని ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రిని గేట్స్ అడిగారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్నామని వివరించారు. భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లను ఏర్పాటుచేసి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏపీ ఏఐ సెర్చ్ బార్‌ను అందుబాటులోకి తెచ్చామని అధికారులు గేట్స్‌కు ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన బిల్‌గేట్స్ పన్నుల వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు.



### సంజీవని ప్రాజెక్టు వెరీ నైస్

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్‌ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... 'దట్స్ వెరీ నైస్' అని వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఏఐ వినియోగం ద్వారా ప్రాథమికంగా వారి సందేహాలను తీర్చేలా వైద్య సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన బిల్‌గేట్స్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి వైద్య సేవలు అందించే విధానం చాలా బాగుందని ప్రశంసించారు. భారత్ బయోడిజైన్ ద్వారా భవిష్యత్తులో వైద్య సేవలు అందించే విధానాన్ని గేట్స్ అడిగి తెలుసుకున్నారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు, స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోందని.. డయాగ్నోస్టిక్స్ సేవలు తక్కువ వ్యయానికే అందితే వారికి వెసులుబాటు ఉంటుందని గేట్స్ వ్యాఖ్యానించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్‌గేట్స్ ఆసక్తిగా తిలకించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్‌గేట్స్ 'గ్రేట్ వర్క్' అని వ్యాఖ్యానించారు.



### గేట్స్‌కు యువ అధికారుల ప్రజెంటేషన్

అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు వీడియో డిస్‌ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికాగార్గ్, ప్రఖర్‌జైన్, సౌరబ్‌గౌర్, సురేష్‌కుమార్... ప్రజెంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్సు, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్, ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు.

## హలో ఫ్రెండ్... హౌ ఆర్ యూ!

### బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు ఆత్మీయ స్వాగతం

*అమరావతి (చైతన్యరథం): హలో ఫ్రెండ్.. హౌ ఆర్ యూ...! ఇదీ సీఎం చంద్రబాబుకు బిల్‌గేట్స్ పలకరింపు. సోమవారం ఏపీలో పర్యటించేందుకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాకు వద్ద ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. చంద్రబాబును చూడగానే.. బిల్‌గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ అని అడిగారు. ఆ తర్వాత తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి పరిచయం చేశారు.*





# అన్నదాతలకు ఏఐ, అగ్రిటెక్ సేవలు అత్యద్భుతం

**◆వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బిల్‌గేట్స్ ◆సాగులో యాప్, డ్రోన్ల వినియోగం పరిశీలన ◆ సీఎం చంద్రబాబు, బిల్‌గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం**

అమరావతి (చైతన్యరథం): వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. వ్యవసాయం–అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలియజేశారు. నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ అవలంబించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డాష్ బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ... ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ రైతు యాప్ గురించి గేట్స్‌కు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలను సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును వివరించారు. బిల్‌గేట్స్ సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి వ్యాధి సోకిన మొక్క ఫొటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ స్ప్రే చేసింది. ఇది స్వయంగా చూసిన బిల్‌గేట్స్... రైతులకు ఏఐ–అగ్రి టెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మరోవైపు రైతులతో బిల్‌గేట్స్ ముఖాముఖి చర్చించారు. మొదటగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ముఖ్యమంత్రికి, బిల్‌గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయ స్వాగతం పలికారు. వారు స్వయంగా వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్‌గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రియ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను గేట్స్ పరిశీలించారు. మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







# నమ్మకానికి నిలువుటద్దం

# హెరిటేజ్

- అవినీతి విషపుత్రిక సాక్షిలా పుట్టింది కాదు... హెరిటేజ్!
- అత్యుత్తమ ప్రమాణాలతో అంతర్జాతీయ అవార్డులు పొందిన సంస్థ
- తప్పుడు రాతలతో నిప్పులాంటి హెరిటేజ్‌కు మకిలి అంటించలేరు
- కల్తీ లడ్డూపై ప్రజాగ్రహాన్ని దారిమళ్లించేందుకే అడ్డగోలు అబద్ధాలు
- రాజకీయ స్వార్థంతో వాస్తవాలను వక్రీకరిస్తూ పదేపదే తప్పుడు ప్రచారం

(చైతన్యరథం ప్రతినిధి-అమరావతి)

అక్రమార్జన, హత్యాకాండ, విభిన్నమైన నేరాల్లో అంతర్జాతీయంగా పేరొందిన కరుడుగట్టిన నేరగాడు, కొలంబియా డ్రగ్ లార్డ్ పాబ్లో ఎస్కోబార్ వేలకోట్ల అవినీతిసొమ్ము పోగేసి చివరకు అమెరికా పోలీసుల చేతిలో కుక్కచావు చచ్చాడు. ఆంధ్రప్రదేశ్‌లో అదే తరహా లక్షణాలు కలిగిన జగన్ రెడ్డి తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించిన వేలకోట్ల పాపపుసొమ్ముతో పేపరు, టీవీ పెట్టి నేరసామ్రాజ్యాన్ని స్థాపించాడు. చివరికి అదే అవినీతి సొమ్మును ఖర్చుచేసి 2019లో అధికారాన్ని కైవసం చేసుకొని అడ్డగోలు దోపిడీని వ్యవస్థీకృతం చేసి లక్షల కోట్లు పోగేశాడు. ప్రజలు నిజం తెలుసుకొని 2024లో పళ్లూడగొట్టి 11కి పరిమితం చేసినా తన సహజ లక్షణమైన చేతివాటాన్ని మర్చిపోలేక కుట్రలకు తెరలేపాడు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబాన్ని ఏదోవిధంగా రోడ్డుకీడ్చాలన్న ఏకైక ఎజెండాతో వ్యక్తిగతంగా తన అవినీతి విషపుత్రిక సాక్షితో పాటు పేటిఎం బ్యాచ్‌తో తప్పుడు ప్రచారం చేయిస్తూ జగన్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నాడు. అయితే దేశంలోనే అత్యంత చైతన్యవంతులైన ఆంధ్ర ప్రజలు నిజానిజాలను గమనిస్తూనే ఉన్నారు. ఉన్నత ప్రమాణాలు, విలువలతో మూడు దశాబ్ధాల క్రితం చంద్రబాబు గారి చేతులమీదుగా ప్రారంభమై లక్షలాది రైతుల నమ్మకాన్ని చూరగొన్న హెరిటేజ్ ప్రతిష్టను మసకబార్చే కుట్రతో అవినీతి విషపుత్రిక సాక్షిలో విషం చిమ్ముతున్నాడు. తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో తమ హయాంలో జరిగిన అపరాధాలను కప్పిపుచ్చుకోవడానికి, ఇందాపూర్ డెయిరీకి 'హెరిటేజ్' రంగు పులిమి పబ్బం గడుపుకోవాలని చూడటం సైకో జగన్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఒక జాతీయ స్థాయి డెయిరీ సంస్థపై బురద చల్లడం ద్వారా భక్తులను మరోసారి వంచించే ప్రయత్నం జరుగుతోంది. నిజం నిప్పులాంటిది... కాస్త ఆలస్యం కావచ్చేమో కానీ అంతిమ విజయం సత్యం, ధర్మానిదే నన్న విషయాన్ని సైకో జగన్ గుర్తించలేకపోడమే ఆయన అమాయకత్వం. హెరిటేజ్‌పై సాక్షి దినపత్రిక, వైసీపీ పేటీఎం బ్యాచ్ గత కొద్ది రోజులుగా చేస్తున్న ప్రచారాలు, వాస్తవాలను ప్రజల ముందుంచడం బాధ్యతగా భావిస్తూ ఈ కథనాన్ని అందిస్తున్నాం.

### ఇందాపూర్ డెయిరీ నేపథ్యం!

ఇందాపూర్ డెయిరీ దేశంలోని అనేక అగ్రశ్రేణి సంస్థలకు నమ్మకమైన వ్యాపార సరఫరాదారుగా ఉంది. ఈ సంస్థ కేవలం హెరిటేజ్ మాత్రమే కాకుండా అమూల్, మదర్ డెయిరీ, బ్రిటానియా, దొడ్ల డెయిరీ వంటి దిగ్గజ కంపెనీలకు పాల ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. ఆధ్యాత్మిక రంగంలో పతంజలి, శ్రీ వేదసత్వ వంటి సంస్థలతో పాటు రిటైల్ రంగంలో డీ-మార్ట్, జొమాటో వంటి ప్రముఖ సంస్థలకు, వివిధ రాష్ట్రాల పాల సమాఖ్యలకు కూడా ఇది ఉత్పత్తులను అందిస్తోంది. కేవలం తిరుమల తిరుపతి దేవస్థానం మాత్రమే కాకుండా షిరిడీ సాయి సంస్థాన్, అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం, గుజరాత్‌లోని అంబాజీ దేవాలయం, ముంబైలోని సిద్ధివినాయక ట్రస్ట్, కేరళలోని దేవస్వం బోర్డు వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలకు ఈ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తోంది. మహారాష్ట్రలోనే అతిపెద్ద డెయిరీగా పేరుగాంచిన ఈ సంస్థ ప్రతిరోజూ దాదాపు 40 లక్షల లీటర్ల పాలను సేకరిస్తూ, దేశంలోనే మొదటి ఐదు అతిపెద్ద డెయిరీలలో ఒకటిగా నిలిచింది. పాల ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం నుండే రెండో అతిపెద్ద సంస్థగా గుర్తింపు పొంది రష్యా, మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా దేశాలకు తన ఉత్పత్తులను పంపిస్తోంది. హెరిటేజ్ ఫుడ్స్‌తో ఈ సంస్థకు కేవలం వ్యాపారపరమైన సరఫరాదారుగా మాత్రమే సంబంధం ఉంది తప్ప, యాజమాన్య పరంగా ఎటువంటి సంబంధం లేదని ఈ సంస్థ అధికారికంగా స్పష్టం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఇంతటి ఘన చరిత్ర, నైతిక విలువలు కలిగిన సంస్థపై బురద చల్లడం ఎంతవరకు సమంజసం?

### ఇందాపూర్ ప్రకటన-అబద్ధాలకు పాతర!

సత్యం గడప దాటేలోపు అబద్ధం ప్రపంచమంతా చుట్టి వస్తుందన్న సామెత, ప్రస్తుతం సాక్షి మీడియా మరియు వైకాపా సోషల్ మీడియా వికృత పోకడలకు అద్దం పడుతోంది. తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో తమ హయాంలో జరిగిన అపరాధాలను కప్పిపుచ్చుకోవడానికి, ఇందాపూర్ డెయిరీకి 'హెరిటేజ్' రంగు పులిమి పబ్బం గడుపుకోవాలని చూడటం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ లోకమంతా చీకటి అనుకున్నట్లు, కేవలం రాజకీయ లబ్ధి కోసం ఒక జాతీయ స్థాయి డెయిరీ సంస్థపై బురద చల్లడం ద్వారా భక్తులను మరోసారి వంచించే ప్రయత్నం జరుగుతోంది. మహారాష్ట్రకు చెందిన 22 ఏళ్ల అనుభవం ఉన్న ఇందాపూర్ డెయిరీ (Sonai Dairy) ఇప్పటికే స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. తమ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్‌తో ఎటువంటి యాజమాన్య లేదా నిర్వహణ సంబంధాలు లేవని, కేవలం బీ2బీ (B2B) సరఫరాదారుగా మాత్రమే సంబంధం ఉందని తేల్చిచెప్పింది. ఇందాపూర్ డెయిరీ పూర్తి స్వతంత్ర సంస్థ. ఏ ఇతర డెయిరీల ఒత్తిడి లేదా ప్రభావం తమపై లేదని సంస్థ స్పష్టం చేసింది. 2014-19 మధ్య కిలో నెయ్యి రూ. 278-306కు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్న వైకాపా నేతలు, అప్పుడు పాల ధర లీటరుకు రూ.17-20 మాత్రమే ఉండేదని మర్చిపోయినట్లు నటిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలు, పాల ధరల (రూ.42/లీ) ఆధారంగానే రూ.658గా నిర్ణయించబడిందని సంస్థ గణాంకాలతో సహా వివరించింది.

> "రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబాన్ని ఏదోవిధంగా రోడ్డుకీడ్చాలన్న ఏకైక ఎజెండాతో వ్యక్తిగతంగా తన అవినీతి విషపుత్రిక సాక్షితోపాటు పేటిఎం బ్యాచ్‌తో తప్పుడు ప్రచారం చేయిస్తూ జగన్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నాడు."

### సాక్షి ప్రచారం.. గోబెల్స్ శిష్యరికం!

సత్యానికి ఆమడ దూరంలో ఉండే సాక్షి ప్రచారాలు ఎలా ఉంటాయో మరోసారి రుజువైంది. హెరిటేజ్ ఫుడ్స్ ఎన్నడూ టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదని, కేవలం పనీర్, చీజ్ వంటి ఉత్పత్తుల కోసం మాత్రమే ఇందాపూర్‌తో ఒప్పందం కలిగి ఉందని సంస్థ ఇప్పటికే ప్రకటించింది. "తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై బురద చల్లడం సాక్షి మీడియాకు వెన్నతో పెట్టిన విద్య." - ఇది భక్తుల మాట. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి సరఫరాపై విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు వెలుగుచూశాయి. చిన్నపాటి డెయిరీలు ఒక్క చుక్క పాలు సేకరించకుండానే నెయ్యిని సరఫరా చేశాయని తేలింది. ఈ పాపాలను ప్రశ్నిస్తే, వెంటనే 'హెరిటేజ్' పేరు తీస్తూ పక్కదోవ పట్టించడం అటు దేవుడిని, ఇటు భక్తులను అవమానించడమే. అబద్ధం వెయ్యి అడుగులు వేయవచ్చు... కానీ నిజం ఒక్క అడుగు వేస్తే అబద్ధం అంతర్ధానం అవ్వాల్సిందే. ఇందాపూర్ డెయిరీ ఇచ్చిన క్లారిటీతో వైకాపా కుట్రలు బట్టబయలయ్యాయి. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు ఆపి, పవిత్రమైన తిరుమల లడ్డూ విషయంలో భక్తుల మనోభావాలను గౌరవిస్తే మంచిది. చట్టపరమైన చర్యలకు హెరిటేజ్ సిద్ధమవుతుండటంతో సోషల్మీడియాలలో తొలగిస్తున్నారు. కానీ ఈ పాటికే ఆధారాలు సేకరించి వున్నాయి. పేటీఎం బ్యాచ్ చట్టం నుంచి తప్పించుకోలేరు.

### హెరిటేజ్ నెయ్యి సరఫరా చేసిందా?

హెరిటేజ్ సంస్థ తన చరిత్రలో ఎప్పుడూ ఏ ప్రభుత్వానికి, ఏ దేవాలయానికి లేదా ఏ ఇతర కంపెనీకి నెయ్యిని సప్లై చేయలేదు. హెరిటేజ్ కేవలం తన సొంత బ్రాండ్ పేరుతో నేరుగా మార్కెట్లో వినియోగదారులకు మాత్రమే నెయ్యిని అమ్ముతుంది. లేని సప్లైని ఉన్నట్టుగా చూపించడం సాక్షి పత్రిక విజ్ఞతకే వదిలేస్తున్నాం. హెరిటేజ్ వెబ్‌సైట్ నుండి ఒక ఫోటోను తీసుకుని, అందులో ఒక కాలమ్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించి (ఎడిట్ చేసి) సాక్షి ప్రచురించింది. ఇందాపూర్ డైరీ అనేది హెరిటేజ్ సంస్థకు కేవలం ఒక 'కో-మాన్యుఫ్యాక్చరింగ్' లొకేషన్ మాత్రమే. అక్కడ కేవలం స్కిమ్డ్ మిల్క్ పౌడర్, చీజ్, పన్నీర్ వంటివి మాత్రమే తయారవుతాయి. అక్కడ నెయ్యి తయారీ అసలు జరగదు. ఈ నిజాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. హెరిటేజ్‌కు 22 యూనిట్లు ఉన్నాయని సాక్షి రాసింది, కానీ వాస్తవానికి ఉన్నవి 15 సొంత యూనిట్లు మాత్రమే. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, హర్యానా, మహారాష్ట్ర, తమిళనాడులో విస్తరించి ఉన్నాయి. వీటి వివరాలన్నీ సంస్థ వెబ్‌సైట్‌లో అత్యంత పారదర్శకంగా ఉన్నాయి. ఇందాపూర్ డైరీ (సోనాయ) అనేది దేశంలోనే అతిపెద్ద డైరీలలో ఒకటి. ఆసియాలోనే అతిపెద్ద స్ప్రే డ్రయర్ ప్లాంట్ వీరి సొంతం. బ్రిటానియా, హిందుస్థాన్ యూనిలివర్, పతంజలి వంటి అంతర్జాతీయ కంపెనీలే వీరి కస్టమర్లు. ఇలాంటి దిగ్గజ సంస్థను తక్కువ చేసి చూపుతూ పేటీఎం బ్యాచ్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదం.

### నెయ్యి ధరల విశ్లేషణ ఇదిగో...!

ద్రవ్యోల్బణం కారణంగా దేశవ్యాప్తంగా నెయ్యి ధరలు పెరిగాయనే కనీస జ్ఞానం సాక్షి పత్రికకు లేదు. 2014-19 మధ్య: మార్కెట్ ధర 260 - 400లోపు ఉంది. 2020-22 మధ్య ధర 600 - 650కి పెరిగింది. 2026 ప్రస్తుతం 600 నుండి 750 వరకు ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారమే ధరలు పెరుగుతుంటే, అప్పట్లో తక్కువ ధరకు ఇచ్చిన పాత రేట్లను ఇప్పుడు ఎక్కువ ధరకు కోట్ చేస్తున్నారని చెప్పడం కేవలం రాజకీయ కుట్ర. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2020-22 మధ్య కాలంలో దేశంలో నెయ్యి ధర 600-650 మధ్య ఉంది. కానీ కొన్ని సంస్థలు (ఏఆర్ డైరీ వంటివి) కేవలం 360కే టీటీడీకి సరఫరా చేశాయంటే, అది ఎంత నాణ్యత లేని 'సింతటిక్ నెయ్యి' అయి ఉంటుందో ప్రజలే ఆలోచించాలి. తక్కువ ధరకే ఇస్తున్నారంటే అది గొప్పతనం కాదు, భక్తుల నమ్మకంతో ఆడుకోవడమే. 10 ఏళ్ల క్రితం 300 ఉన్న వస్తువు ఈరోజు కూడా అదే ధరకు ఎలా వస్తుంది? పదేళ్లలో టూత్ బ్రష్ నుంచి వాడే సబ్బు వరకు అన్నిటి ధరలు పెరిగాయి. నెయ్యి ధర కూడా 2026 నాటికి 750కి చేరింది. ఇందాపూర్ డైరీ అప్పట్లో 300కి ఇచ్చి, ఇప్పుడు 658 కోట్ చేసిందంటే అది పెరిగిన ఉత్పత్తి ఖర్చుల వల్లే. దీనిని దోపిడీగా చిత్రీకరించడం వారి అజ్ఞానానికి పరాకాష్ట.

### భారతి సిమెంట్స్ ధర మారలేదా?

సాక్షి ఓనర్ జగన్ మోహన్ రెడ్డి గారి సొంత సంస్థ భారతీ సిమెంట్ 2014లో బస్తా ?250కి అమ్మితే, ఈరోజు 430కి ఎందుకు అమ్ముతున్నారు? మీ ఖర్చులు పెరిగినప్పుడు రేటు పెంచడం తప్పు కానప్పుడు, డైరీ రంగంలో రేట్లు పెరగడం తప్పు ఎలా అవుతుంది? హెరిటేజ్ సంస్థకు టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అలవాటే లేదు. అలాంటప్పుడు సిండికేట్ ఎందుకు ఫామ్ చేస్తుంది? నిజానికి 2019-24 మధ్య సిమెంట్ ధరలను కార్టెల్‌గా మార్చి దోచుకున్నది ఎవరో అందరికీ తెలుసు. నష్టాల్లో ఉన్న సాక్షి పత్రికకు ప్రభుత్వ ప్రకటనల ద్వారా ప్రజా ధనాన్ని మళ్లించి 600 కోట్లకు పైగా ఎలా దోచుకున్నారో బ్యాలెన్స్ షీట్లు చూస్తే అర్థమవుతుంది. దేశంలో సాక్షి కంటే 5 రెట్లు పెద్దవైన దైనిక్ జాగరణ్, దైనిక్ భాస్కర్ వంటి పత్రికల మార్కెట్ క్యాప్ 1500 కోట్లే ఉంటే, 2008లోనే సాక్షికి 3500 కోట్ల వాల్యుయేషన్ ఎలా వచ్చింది? ఇది క్విడ్ ప్రోకో కాదా? మనీ లాండరింగ్, షెల్ కంపెనీల ద్వారా వ్యాపారాలు చేసేవారికి, నిజాయితీగా వ్యాపారం చేసే హెరిటేజ్ వంటి లిస్టెడ్ కంపెనీల విలువ తెలియదు. సాక్షి ఓనర్ పార్టీలోనే డైరీ వ్యాపారం చేసే నాయకులు బొల్లా బ్రహ్మనాయుడు గారు వంటి వారు ఉన్నారు. గతంలో తిరుమల డైరీని మల్టీనేషనల్ కంపెనీకి అమ్మేసి, ఇప్పుడు 'వల్లభ' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. ఈరోజు మార్కెట్‌లో తిరుమల, వల్లభ నెయ్యి ధరలు లీటరుకు 600 నుండి 675 వరకు ఉన్నాయి. మీ నాయకుల కంపెనీలే ఈ రేట్లకు అమ్ముతుంటే, హెరిటేజ్‌పై అవాస్తవాలు ప్రచురించడం మీ ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా?

### నమ్మకానికి నిలువుటద్దం హెరిటేజ్

హెరిటేజ్ అంటే కేవలం ఒక వ్యాపార సంస్థ కాదు, అది లక్షలాది రైతుల నమ్మకానికి నిలువుటద్దం. ఇటీవల భువనేశ్వరి గారికి ఇన్స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ నుండి 'గోల్డెన్ పీకాక్' అవార్డు లభించింది. ఒక దక్షిణ భారత పారిశ్రామికవేత్తకు ఇలాంటి అత్యున్నత పురస్కారం రావడం గర్వకారణం. ఇది ఒక లిస్టెడ్ కంపెనీ. ప్రభుత్వానికి సకాలంలో పన్నులు కట్టడంలోనూ, బ్యాంకుల అప్పులు తీర్చడంలోనూ ఈ సంస్థకు క్లీన్ రికార్డ్ ఉంది. పాలు పోసే వేలాది మంది రైతులకు ఒక్క రూపాయి కూడా బాకీ పడకుండా 'జీరో డ్యూస్' మెయింటైన్ చేస్తున్న ఏకైక సంస్థ హెరిటేజ్. గత 20 ఏళ్లుగా ఈ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారికి ఏడాదికి సగటున 20-25% లాభం అందించిన చరిత్ర దీనిది. 2008లో కేవలం 500 కోట్ల విలువ లేని కంపెనీకి 3500 కోట్ల వాల్యుయేషన్ కట్టి క్విడ్ ప్రో కో ద్వారా నిధులు రాబట్టింది నిజం కాదా? గత ఐదేళ్లలో వందల కోట్ల ప్రభుత్వ ప్రకటనల ద్వారా సాక్షిని ఎలా పోషించారో అందరికీ తెలుసు. అధికారం పోగానే మీ బ్యాలెన్స్ షీట్లలో కోట్ల నష్టాలు ఎలా వస్తున్నాయి? మనీ లాండరింగ్, షెల్ కంపెనీల ఆరోపణలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారు.. నీతిగా వ్యాపారం చేసేవారిని విమర్శించడం హాస్యాస్పదం. అవాస్తవాలు రాస్తూ ఇప్పటికే పరువు నష్టం కేసుల్లో ఇరుక్కున్న సాక్షి యాజమాన్యానికి ఇదే మా హెచ్చరిక. మీ అల్మారాలో ఉన్న అస్థిపంజరాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. జైలు గడపకు మీరు ఎంతో దూరంలో లేరు. అబద్ధపు రాతలు రాసే పత్రికలను నమ్మకండి. వాస్తవాలను ఆలోచించి నిర్ణయించుకోండి. ఇలాంటి దిగజారుడు కథనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి రాజకీయస్వార్థంతో జగన్&కో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిందిగా ప్రజలను కోరుతున్నాం.



# బిల్‌గేట్స్‌కు ఘన స్వాగతం



గన్నవరం (చైతన్యరథం): అమరావతి పర్యటనలో భాగంగా గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్, హోం శాఖ మంత్రి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, అధికారులు ఘన స్వాగతం పలికారు.































చైతన్యరథం









# వ్యవసాయ క్షేత్రంలో బిల్‌గేట్స్

## ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతం - డ్రోన్ సేవలపై ప్రశంసలు

ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రా న్ని సోమవారం సీఎం చంద్రబాబుతో కలిసి బిల్‌గేట్స్ సందర్శించా రు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతి క వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను స్వయంగా పరిశీ లించారు. డ్రోన్ సేవలను స్వయంగా చూసిన బిల్ గేట్స్... రైతు లకు ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతమని ప్రశంసించారు. స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు. సేంద్రీయ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను పరిశీలించారు.











# మరింత సులభతరంగా పౌరసేవలు

- పాలనలో నిబంధనల సరళీకరణకు కార్యాచరణ
- సామర్థ్యాల మెరుగుకు శిక్షణ కోర్సులు అందించాలి
- అధ్యయనం కోసం ఓ కమిటీని వేయాలి
- పథకాలు, ప్రాజెక్టుల్లో అత్యుత్తమ ప్రమాణాలు
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై క్యాంప్ కార్యాలయంలో సమీక్ష
- బిల్‌గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులకు అభినందన



అమరావతి (చైతన్యరథం): పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనలు మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని వెల్లడిం చారు. దీనిపై అధ్యయనం కోసం ఓ కమిటీ వేయాలని ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం సమీక్షించారు. టెక్నాలజీ అనుసంధానంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి అనుగుణంగా ప్రతీ ప్రభుత్వ శాఖ సన్నద్ధం కావాలని.. సులభ తరమైన పౌరసేవలు అందించాలని సీఎం సూచించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదు..ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలి.. ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వంలోని 8.20 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణా సామర్థ్యాల ను మరింత మెరుగుపరుచుకునేలా వివిధ కోర్సుల్లో శిక్షణ తీసు కోవాలన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ కోర్సులను అం దించాలని సీఎం సూచించారు. వార్షిక నివేదికల్లోనూ సామర్థ్యాన్ని ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని అధికారులను అభి నందించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏపీఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరా వతి ప్రాజెక్టులపై చూపిన ప్రజెంటేషన్లు బిల్‌గేట్స్‌ను కూడా ఆక ట్టుకున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులో గేట్స్ ఫౌండేషన్ ద్వారా చేపట్టే ప్రాజెక్టులను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగిం చుకోవాలని సూచించారు.

### అత్యుత్తమ ప్రమాణాలు అనుసరించాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్ర మాలు, ప్రాజెక్టుల్లో అమలవుతున్న అత్యుత్తమ ప్రమాణాలు అన్నిం టా అనుసరించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదే శించారు. తద్వారా ప్రజల నుంచి మంచి అభిప్రాయం వ్యక్తం అవు తుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నా క్యాంటీన్లలో వడ్డించే ఆహారాన్ని మరింత రుచికరంగా ఉండేలా చూడాలని సీఎం సూచనలు చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక బెస్ట్ హాస్టల్‌ను మోడల్‌గా తీసుకుని మిగిలిన వాటి లోనూ అవే ప్రమాణాలను పాటించేలా చూడాలని సూచించారు.

### విజిబుల్ పోలీసింగ్ కీలకం

మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో విజిబుల్ పోలీ సింగ్ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నేరాల రేటును తగ్గించే అంశంలో పోలీసు విభాగం తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాల న్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న చర్యల్ని ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలని హోంశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎప్పటికప్పుడు చెత్తను క్లియర్ చేయటంతో పాటు కలుషిత నీటి సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇప్పటినుంచే ముందస్తు కార్యాచరణ చేప ట్టాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు డ్రోన్ వినియోగాన్ని పెంచి పౌరసేవలను మరింత సరళతరం చేయాలన్నారు. ఈ సమీక్షలో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ కె.విజయానంద్ పురపాలక, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ మంత్రి తుమ్మల

- రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రాజెక్టులతో లబ్ధి
- సంప్రదింపులతో పరిష్కారమని వెల్లడి

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవా రం భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకా రంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజె క్టులు, రైల్వేలైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ధి జరుగుతుందని తుమ్మల అభిప్రా యపడ్డారు. వీటికి సంబంధించిన వివరాలను వివరించారు. రెండు ప్రభుత్వాలు ఉన్నత స్థాయిలో సంప్రదింపుల ద్వారా ఈ సమస్యల పరిష్కారం జరుగుతుందని తెలిపారు.



## రైతులతో లోకేష్

### ఆత్మీయ పలకరింపు

ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవా బిల్‌గేట్స్, సీఎం చంద్రబాబు, లోకేష్ సందర్శించారు. ఈ సంద ర్భంగా అక్కడ రైతులను ఆత్మీయంగా పలకరించారు. వారితో కలిసి లోకేష్ ఫొటోలు దిగారు.









# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

**- రూ.17.36 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

నర్సీపట్నం(చైతన్యరథం): ఆపదలో ఉన్న పేద ప్రజలను, ప్రమాదాలకు గురైన బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కొనియాడారు. సోమవారం నర్సీపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ కేవలం ఈ ఒక్కరోజే నియోజకవర్గానికి చెందిన నర్సీపట్నం మున్సిపాలిటీ 4, నర్సీపట్నం రూరల్ 2, నాతవరం మండలం 5, మాకవరపాలెం మండలం 2 మొత్తం కలిపి 13 మంది లబ్ధిదారులకు రూ.17.36 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న ఈ ఎనిమిది తొమ్మిది నెలల స్వల్ప కాలంలోనే నర్సీపట్నం నియోజకవర్గంలో ఇప్పటివరకు 160 మంది బాధితులకు సుమారు రూ.1.55 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించడం జరి గిందని వివరించారు. ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్య కారణాల వల్ల భారీ ఖర్చుతో కూడిన ఆపరేషన్లు చేయించుకోవాల్సి వచ్చినప్పుడు పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించాలనే



మానవీయ కోణంలో ప్రభుత్వం ఈ సాయాన్ని అందిస్తోందని తెలిపారు. సామాన్య ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలకు ఈ పథకం భరోసానిస్తుందని చెప్పారు. నర్సీపట్నం తరహాలోనే రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లోనూ ముఖ్యమంత్రి ఈ సహాయాన్ని నిరంతరాయంగా అందిస్తున్నారని, ఎంతో మంది పేదలకు వరమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు, ఆర్.వై.పాత్రుడు, నందిపల్లి వెంకటరమణ, మున్సిపాలిటీ నాయకులు పైల గోవిందు, రాజ్‌కుమార్, శ్రీకాంత్, రూరల్ సీనియర్ నాయకులు శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తణుకులో థాంక్యు లోకేష్ కార్యక్రమం

**- చిత్రపటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థులు**

**- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై హర్షం**

తణుకు(చైతన్యరథం): రాష్ట్రంలోని పేద, మధ్య, దిగువ తరగతి వర్గాల విద్యార్థుల చదువులకు గత ప్రభుత్వం ఎన్నో ఆటంకాలు కలిగించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు జీవో జారీ చేసింది. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తణుకులో సోమవారం విద్యార్థులు, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో కలిసి మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా నే 20 నెలల కాలంలో రూ.2800 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించగా..ఈ నెలలోనే రూ.1200 కోట్లు చెల్లించడానికి జీవో ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద



సంఖ్యలో విద్యార్థులు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిమాన్వితం పెద్దయ్య ఆలయం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**- తిరుణాల మహోత్సవంలో దేవరెద్దుకు పూజలు**

*రాయచోటి(చైతన్యరథం): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామం కురవపల్లిలో వెలసిన మాలే పెద్దయ్య స్వామి దేవస్థానం మహిమగల దేవస్థానమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. దేవగుడిపల్లి గ్రామంలో ఉన్నటువంటి అతి పురాతనమైన మాలే పెద్దయ్య స్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా సతీమణి హరితమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు మౌర్యారెడ్డి, మండిపల్లి రాహుల్‌రెడ్డిల ఆధ్వర్యంలో దేవరెద్దుకు, పెద్దయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ చిన్నమండెం మండలంలో అతి పురాతనమైన ప్రసిద్ధి కలిగి ఉన్న దేవాలయాలలో మాలే పెద్దయ్య స్వామి దేవస్థానం కూడా ఒకటన్నారు. మహా శివరాత్రి సందర్భంగా తిరునాళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వామివారి దర్శించుకునే భక్తులకు అన్ని రకాల వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవ స్థానానికి రోడ్లు భవనాలు కూడా నిర్మించేందుకు కృషి చేస్తామని వివరించారు.*

# నామినేషన్ విత్ డ్రా చేసుకోలేదని కబ్జా

- **గత ప్రభుత్వంలో మాజీ మంత్రి కక్షపూరిత చర్యలు**
- **వైసీపీ నేతల భూ ఆక్రమణ యత్నం..బెదిరింపులు**
- **ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు**
- **అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత, మంతెన, శ్రీధర్**

మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ నేతల భూ ఆక్రమణ యత్నంపై తిరుపతి జిల్లా చెర్లోపల్లి గ్రామానికి చెందిన కె.నిరోషా టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకర ణ కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. తమ గ్రామంలో సర్వే నెం.120/5లో ఉన్న తమ భూమిని స్థానిక వైసీపీ నేతలు కొంత మంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే సర్వే నెం.201/2 భూమిపై కోర్టులో కేసు నడుస్తుండగానే నిబంధనలకు విరుద్ధంగా వేరే వ్యక్తులు ఆన్‌లైన్‌లో తమ పేర్ల మీద నమోదు చేసుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దీంతో పాటు తమ పూర్వీకుల నుంచి సంక్ర మించిన సర్వే నెం.162/1, 162/4ఏ భూములకు సంబంధించి 'నోషన్ ఖాతా' సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై గతంలో ఆర్డీవోకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు బీసీ సంక్షేమ, చేనేత, టెక్స్‌టైల్ శాఖ మంత్రి సవిత, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, బెస్త సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ అర్జీలు స్వీకరించారు.

### భూమిని లాక్కుని పట్టాలు పంపిణీ చేశారు

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం జుపల్లి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను టీడీపీ తరపున ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశాను. నామినేషన్ ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చినా లొంగకపోవడంతో మాజీ మంత్రి నారాయణ స్వామి కక్షపూరితంగా వ్యవహరించి తన సొంత భూమిని ఆక్రమిం చారు. సర్వే నెంబర్ 131-4లో గల 3.98 ఎకరాల భూమి తన తల్లి సిద్దమ్మ పేరుపై 2000 సంవత్సరంలో మంజూరు చేశారు. ఎన్నో ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న ఈ భూమిని అక్రమంగా లాక్కుని పట్టాలు పంపిణీ చేశారు. దీనిపై పలుమార్లు అధికారు లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.



### భూమిని ఆక్రమించి దౌర్జన్యం

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం కోటకొండ గ్రామానికి చెందిన మండ్ల కాశమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలోని సర్వే నెం.285-7సీలో తమకు 3.00 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్, 1బీ, అడంగల్, ఆన్‌లైన్ రికార్డులన్నీ తన పేరుపైనే ఉన్నాయి. అదే సర్వే నెంబర్‌లో పక్కనే 2 ఎకరాల భూమి ఉన్న కల్లకుంట్ల బాలరాజు అనే వ్యక్తి తమకు చెందిన సుమారు 1.60 ఎకరాల భూమిని గత మూడేళ్లుగా దౌర్జన్యంగా ఆక్రమించి సాగు చేస్తున్నా డు. భూమి గురించి అడిగితే తను ఎస్సీ కులానికి చెందిన వాడిన ని..ఎదురు తిరిగితే అక్రమ కేసులు పెడతానని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. తాము సాగు చేసిన పంటను నాశనం చేయడమే కాకుండా పొలంలోని నీటి పైపులను కూడా తగులబెట్టారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేసి నా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### పొలంలోకి వెళ్లకుండా దౌర్జన్యం

కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గోడెం అనుమా యమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం.322/1, 322/2, 589/1లలో మొత్తం 1.19 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలోకి వెళ్లడానికి సర్వే నెం.322/3 (0.14 సెంట్లు) గుండా దారి ఉంది. పక్క పొలం వారైన గోడెం వేణు వారి కుటుంబసభ్యులు తమను పొలంలోకి వెళ్లకుండా దౌర్జన్యం గా అడ్డుకుంటున్నారు. అడిగితే చంపుతామని బెదిరిస్తూ దుర్భాష లాడుతున్నారు. గతంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకోగా గన్నవ రం మండల సర్వేయర్ వచ్చి భూమిని కొలవడానికి ప్రయత్నించా రు. ఆ సమయంలో ఎదుటి పక్షం వారు సర్వేయర్‌పై దాడికి దిగి సర్వే జరగకుండా అడ్డుకున్నారు. దీనివల్ల ఇంతవరకు ఎటువంటి రిపోర్టు అందలేదు. వారిపై చర్యలు తీసుకునితమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### పొలం లీజుకు తీసుకుని బెదిరింపులు

నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన ఆవుల శ్రీకాంత్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. కర్నూలుకు చెందిన కోడితం శ్రీనివాసులు అనే వ్యక్తి తమ పొలాన్ని (సర్వే నెం:243/1, విస్తీర్ణం 2.32 ఎకరాలు) కంకర ఫ్యాక్టరీ కోసం 12 ఏళ్ల లీజుకు తీసుకుంటానని నమ్మించాడు. లీజు అగ్రి మెంట్ అని చెప్పి తన తండ్రిని రిజిస్టర్ ఆఫీసుకు తీసుకెళ్లి అక్కడ ఆయనకు మద్యం తాపించి మత్తులో ఉన్న సమయంలో లీజు పత్రాలకు బదులు సేల్ డీడ్ (అమ్మకం పత్రాలు)పై సంతకాలు చేయించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ (తేదీ:29-06-2002) చేయించుకున్నాడు. ఎటువంటి మైనింగ్ అనుమతులు, లైసెన్సులు లేకపోయినా దౌర్జన్యంగా బ్లాస్టింగ్ చేస్తూ కంకర ఫ్యాక్టరీ నడుపు తున్నాడు. లీజు గడువు ముగిసిన తర్వాత తమ పొలం తమకు ఇవ్వమని అడిగితే "పొలం నేను కొన్నాను, వస్తే చంపేస్తాను" అంటూ కోడితం శ్రీనివాసులు తుపాకీతో బెదిరిస్తున్నాడు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### పొలాలకు నీరు ఆపేస్తున్నారు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన మురళీ పొలాలకు నీరు ఆపేస్తున్నారని గోడు వెళ్లబోసు కున్నాడు. గానుగ మడి, కురవక కాలువల పక్కన పొలం ఉన్న అక్కిరెడ్డి గారి నరసింహారెడ్డి సుమారు 25 మీటర్ల మేర కాలువ ను పూర్తిగా పూడ్చివేశారు. దీనివల్ల తదుపరి పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పడమటి నుంచి తూర్పుకు, దక్షిణం నుంచి పడమటికి వెళ్లే కాలువలను గంగయ్య కుమారుడు గోవిందు, ఇతరులు అడ్డుకుంటున్నారు. మూడు తరాలుగా వస్తున్న ఈ కాలువలపై తమకు హక్కు ఉంద ని తాము చెబుతున్నా దౌర్జన్యంగా నీటిని ఆపేస్తున్నారు. సర్వే నెం.113/7 లోని 0.09 సెంట్లు, సర్వే నెం.156-435లోని భూములను నరసింహారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీనిపై పలుమా ర్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలే దు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం

### ఎంఎస్ఎంఈ రంగానికి భారీ కేటాయింపులు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి (చైతన్యరథం): ఏపీ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రతిష్టాత్మక పథకం “ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త” ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇది వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర ఏ2047 దార్శనికతకు అనుగుణంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్.. మౌలిక సదుపాయాల అభివృద్ధికి, రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థ ను బలోపేతం చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఏపీ - సీడీపీ పథకం కింద రూ.200 కోట్ల వ్యయంతో ఐదేళ్లలో 45 ఉమ్మడి సౌకర్య కేంద్రాల (సీఎఫ్‌సీఎస్) ఏర్పాటు చేయటం ద్వారా 1,688 కొత్త సంస్థలు ఆవిర్భవించనున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 15 పార్కులు అందుబాటులోకి రాగా, 82 పార్కులకు శంకుస్థాపన పూర్తిచేసి మౌలిక సదుపా యాల కల్పనా కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో కేంద్ర



ప్రభుత్వ ఎంఎస్ ఈ - సీడీపీ పథకం కింద 60-80% గ్రాంట్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 15-20% నిధులను భరిస్తోందని చెప్పారు.

**బడ్జెట్ 2026-27 కేటాయింపులు**

క్లస్టర్ అభివృద్ధికి రూ.111.82 కోట్లు, రూ.మౌలిక సదుపా యాల కల్పనకు రూ.100 కోట్లు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ప్రోత్సాహకాలకు రూ.229.36 కోట్లు, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.316.38 కోట్లు, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు రూ.71.20 కోట్లు ప్రోత్సాహకాల కోసం కేటాయించటం జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఎంఎస్ఎంఈల ప్రమోషన్ కోసం ఈసారి రూ.84 కోట్లు అదనంగా కేటాయించ బడ్డాయని తెలిపారు. సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమలకు రుణ భరోసా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ అమలులోకి వచ్చిందని, దీని కింద 95% వరకు రుణ గ్యారెంటీ లభిస్తుందని అన్నారు. ఇందు కోసం ప్రయోగాత్మకంగా బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారని చెప్పారు. ఎంఎస్ఎంఈలకు చెల్లింపులు వేగంగా జరిగేలా రాష్ట్ర వ్యాప్త TReDS మాండేట్‌ను ప్రభుత్వం జారీ చేయనుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2026తో అనుసంధానంలో భాగంగా మూడు ప్రధాన వ్యూహాలతో ముందుకు వెళ్లనున్నామని అన్నారు.

**1.ఈక్విటీ సపోర్ట్ (పెట్టుబడి సహాయం):**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ సహాయంతో రాష్ట్రంలో “ఏపీ ఛాంపియన్ ఎంఎస్ ఎంఈ మిషన్” ప్రారంభించబడుతుందని, దీని కింద రాష్ట్రంలోని టాప్ 500 ఎంఎస్ఎంఈలను గుర్తించి వాటిని అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.

**2. లిక్విడిటీ సపోర్ట్ (నగదు లభ్యత):**

ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ (TReDS) ప్లాట్‌ఫారమ్ ద్వారా ఎంఎస్ ఎంఈలు తాము సరఫరా చేసిన వస్తువులకు వెంటనే నగదు పొందే సదుపాయం కల్పిస్తారని, దీనిని జెమ్ పోర్టల్‌తో అనుసంధా నిస్తారని తెలిపారు.

**3. ప్రొఫెషనల్ సపోర్ట్ (కార్పొరేట్ మిత్ర):**

ఐసీఏఐ, ఐసిఎస్ఐ వంటి సంస్థల సహకారంతో ‘కార్పొరేట్ మిత్ర’ అనే నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తారని అన్నారు. వీరు జిల్లా పారిశ్రామిక కేంద్రాలు (DIC), ఎంఎస్ఎంఈ పార్కులలో ఉండి చిన్న పరిశ్రమలకు నిబంధనల అమలులో (Com pliance) తోడ్పడతారని చెప్పారు.

హార్టికల్చర్, ఎగుమతి రంగం అభివృద్ధిలో భాగంగా కొబ్బరి, జీడిమామిడి, కోకో రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానాల్లో ఉందని, కొబ్బరి ప్రాసెసింగ్‌లో రూ.1,000 కోట్లు, కోకోలో రూ.400 కోట్ల పెట్టుబడి సామర్థ్యం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కొత్త పథకాల ద్వారా ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ బ్రాండ్‌లుగా మార్చనున్నామని తెలిపారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై సుంకం లేని దిగుమతి పరిమితిని 1% నుంచి 3%కి పెంచడం వల్ల ఏపీలోని ఆక్వా రంగం మరింత ప్రపంచ స్థాయి పోటీని తట్టుకుని ముందుకు సాగుతుందని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని ఒక పారిశ్రామిక కేంద్రంగా మార్చడమే మా లక్ష్యంగా ఈ బడ్జెట్ కేటాయింపులు మన యువతను ఉద్యోగాల కోసం వెతికే వారి నుంచి..ఉద్యోగాలు ఇచ్చే వారిగా మారుస్తాయని తెలిపారు.

# కాజులూరులో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

### రూ.2.40 కోట్లతో పనులకు శంకుస్థాపన - పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం(చైతన్యరథం): నియోజవర్గంలోని కాజులూరు మండలంలో రూ.2.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పలు రహదారి అభివృద్ధి పనులకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని ఉండూరు బ్రిడ్జి నుంచి పటవల వరకు రూ.2 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే గొల్లపాలెం నుంచి కుయ్యేరు (చేదువాడ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు) వరకు రూ.40 లక్షలతో నిర్మించనున్న రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం కీలకమని, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. రామచంద్రపురం నియోజవర్గంలో ఇప్పటివరకు రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టమన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, డైరెక్టర్ దడాల నాగార్జున, ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీప్రసన్న, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న, మంజేరు ఎంపీటీసీ గండి మణికంఠ, మంజేరు సొసైటీ ధర్మరాజు, కోలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహానాయుడు, ఉప్పిమిల్లి ఎంపీటీసీ యాళ్ల కృష్ణమూర్తి, కాజులూరు డీసీ కృష్ణచైతన్య, నాయకులు వేగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, సలాది నానాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీశైల క్షేత్రంలో రథోత్సవం

శ్రీశైలం (చైతన్యరథం): శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగం గా తొమ్మిదో రోజైన సోమవారం సాయంత్రం భ్రమరాంబ మల్లికా ర్జున స్వామివార్ల రథోత్సవం శోభాయమానంగా జరిగింది. రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం రథంపై విహరి స్తూ స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. కళాకారుల కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.







## 21న అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు

తానా: మాతృ భాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 22న "మన తెలుగు భాషను ప్రేమిద్దాం, పరిరక్షిద్దాం, పరివ్యాప్తి చేద్దాం" అనే నినాదంతో అంతర్జాతీయ అంతర్జాల దృశ్య సమావేశాన్ని నిర్వహిస్తోంది.



ముఖ్య అతిథి: 'పద్మభూషణ్' డాక్టర్ నోరి దత్తాత్రేయుడు (ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు, న్యూయార్క్).
విశిష్ట అతిథి: డాక్టర్ జి.సతీష్‌రెడ్డి (భారతదేశ డీఆర్డీవో పూర్వ చైర్మన్).
గౌరవ అతిథి: ఆర్యన్ ఉదయ్ అరేటి (డిప్యూటీ మేయర్, రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియా, లండన్).
ప్రముఖ వక్తలు (విద్యావేత్తలు):
ఆచార్య డాక్టర్ వెలుదండ నిత్యానందరావు (ఉప కులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్), ఆచార్య డాక్టర్ డి.మునిరత్నంనాయుడు (ఉప కులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం).
ఆచార్య డాక్టర్ అఫ్సర్ (తెలుగు అధ్యాపకుడు, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, అమెరికా).
ఆచార్య ఉమా ఆత్రేయ (తెలుగు అధ్యాపకురాలు, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, సియాటెల్, అమెరికా).
ఆచార్య డాక్టర్ భారతి శంకరరాజు (తెలుగు అధ్యాపకురాలు, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, అమెరికా).
నిర్వాహక బృందం: డాక్టర్ నరేన్ కొడాలి: అధ్యక్షుడు, తానా.
చిగురుమళ్ల శ్రీనివాస్: సమన్వయకర్త, తానా ప్రపంచ సాహిత్య వేదిక.
డాక్టర్ ప్రసాద్ తోటకూర: నిర్వాహకుడు, తానా ప్రపంచ సాహిత్య వేదిక.
ఈ కార్యక్రమాన్ని యూట్యూబ్, యప్పీ టీవీ (YuppTV), టోరే (Tore) చానెళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

## ఎపెక్స్‌లో 28న 'టాటా' పికిల్‌బాల్ టోర్నమెంట్

ఎపెక్స్‌లో 28న 'టాటా' పికిల్‌బాల్ టోర్నమెంట్
టాటా: ట్రయాంగిల్ ఏరియా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ కరోలినా తన 35 ఏళ్ల ప్రస్థానంలో భాగంగా ఈ నెల 28వ తేదీన భారీ పికిల్‌బాల్ టోర్నమెంట్ జరగనుంది. ఎపెక్స్‌లోని 'పీక్ స్పోర్ట్స్' వేదికగా 2026 కార్యవర్గ సభ్యులు ఈ టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు.




అధ్యక్షుడు: వినోద్ కుమార్ కట్రగుంట
ఉపాధ్యక్షుడు, టీఎల్‌ఏ: నాగ గొంధి
సెక్రటరీ: వెంకట్ కోగంటి
కోశాధికారి (మహిళా విభాగం): హేమ దాసరి
జాయింట్ సెక్రటరీ (తెలుగు బడి): సాయి మహేష్ గద్దంశెట్టి
స్పోర్ట్స్: వెంకట నరేష్ మొక్క
మెంబర్‌షిప్: ప్రవీణ్ పెద్ది
ఫుడ్, లాజిస్టిక్స్: సాయి శ్రీకాంత్ ఉప్పలపాటి
లాజిస్టిక్స్ (చేయూత): భూమేష్ గండే
కల్చరల్, సాహిత్య వేదిక: శివ బోనగిరి
టాటా యువ: గణేష్ మంత్రిప్రగడ
మెన్స్ డబుల్స్, ఉమెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. విజేతలకు ఆకర్షణీయమైన ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు కూడా ప్రదానం చేస్తారు. 12 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం ఉచితం.
రిజిస్ట్రేషన్ ఫీజు: 'టాటా' సభ్యులకు $15
సభ్యులు కాని వారికి $15.
నిర్వాహకుడు నరేష్ మొక్క (848-256-5272) ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తెలుగు వారందరూ ఈ క్రీడా సంబరంలో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ పిలుపునిచ్చింది.




## టీఏఎల్ 14వ వార్షిక వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం

# విజేత బెజవాడ బ్లాకర్స్




లండన్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ 14వ వార్షిక వాలీబాల్ టోర్నమెంట్ యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్‌లోని స్పోర్ట్స్ డాక్‌లో విజయవంతంగా జరిగింది. బ్రిటన్ అంతటా ఉన్న తెలుగు సమాజ సభ్యులను ఏకం చేస్తూ ఈ టోర్నమెంట్‌తో 'టీఏఎల్ 2026 క్రీడా సంవత్సరాన్ని అధికారికంగా ప్రారంభించింది. వార్షిక క్యాలెండర్‌లో భాగంగా ప్రతిష్ఠాత్మక ప్రీమియర్ లీగ్ సహా మరిన్ని క్రీడా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

జోషి కొమరవల్లి నాయకత్వంలోని "బెజవాడ బ్లాకర్స్" జట్టు టోర్నమెంట్ అంతటా అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. అఖిల్ నాయకత్వంలోని "మొబైల్ 365" జట్టు బలమైన పోటీ ఇచ్చి రన్నరప్‌గా నిలిచింది. రాకేష్ కామేపల్లి నాయకత్వంలోని "పల్నాడు టైగర్స్" జట్టు మూడవ స్థానాన్ని సాధించింది.

విజేత జట్లను సభ్యులు క్రీడా స్ఫూర్తి, పట్టుదల, నైపుణ్యాన్ని టీఏఎల్ చైర్మన్ రవి సబ్బా అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ట్రస్టీలు సత్య పెద్దిరెడ్డి, అశోక్ మాడిశెట్టి, రవి మోచెర్ల, శ్రీదేవి ఎల్లెద్దుల, వెంకట్ నీల, కిరణ్ కప్పెటలకు కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి సింధూర చెరుకు, అంకితభావంతో పనిచేసిన వాలంటీర్లకు చైర్మన్ రవి సబ్బా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రవి సబ్బా క్రీడాకారుల స్ఫూర్తిని ప్రశంసిస్తూ... టీఏఎల్ క్రీడా, సామాజిక కార్యక్రమాలకు అందరి మద్దతు కొనసాగాలని కోరారు. మార్చి 21న నిర్వహించనున్న టీఏఎల్ ఉగాది వేడుకలకు అందరినీ ఆహ్వానించారు.





## మిడిల్‌టౌన్‌లో 22న చెస్ టోర్నమెంట్




తానా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22న డెలావేర్‌లోని మిడిల్‌టౌన్‌లో చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.
వేదిక: బెస్ట్ బ్రెయిన్స్ మిడిల్‌టౌన్, 105 స్లీపీ హాలో డ్రైవ్, సూట్ డి, మిడిల్‌టౌన్, డీఈ 19709.
సమయం: మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు
పోటీల విధానం: ఐదు రౌండ్ల 'స్విస్ సిస్టమ్' (+25 డీ5) పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రతి సెక్షన్‌లో మూడు బహుమతులు ఉంటాయి.
విభాగాలు: రేటింగ్ ఉన్న వారికి (U500/U900/Open), రేటింగ్ లేని వారి కోసం (K-8, 9-12 with Adults) ప్రత్యేక సెక్షన్లు ఉన్నాయి. ఫీజు: ఎంట్రీ ఫీజు $20.
నిర్వాహకులు, ప్రతినిధులు:
డాక్టర్ నరేన్ కోడలి: ప్రెసిడెంట్, తానా
రవి పొట్లూరి: బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, తానా
ఫణి కంతేటి: మిడ్ అట్లాంటిక్ రీజనల్ రిప్రజెంటేటివ్ (610-620-4135).
నయుడమ్మ యలవర్తి: ఈవెంట్ కో-ఆర్డినేటర్ (617-510-2799). వెంకట్ సింగు: బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్, తానా
జోషువా ఆండర్సన్: టోర్నమెంట్ డైరెక్టర్
లొంగ ప్రసాద్ చావా: తానా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్.
ఈ కార్యక్రమానికి గ్లెన్‌మూర్ ఫ్యామిలీ డెంటిస్ట్రీ గ్రాండ్ స్పాన్సర్‌గా, ఎక్స్‌పీరియర్ ఫైనాన్షియల్ గ్రూప్ గోల్డ్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి. ఆసక్తి గల వారు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

- కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోంది
- సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు అన్నారు. సోమవారం నాడు పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నరసన్నపేట నియోజకవర్గ నుండి 33 మంది లబ్ధి దారులకు రూ.21,00,700/- ఇరవై ఒక లక్ష ఏడు వందల రూపాయల చెక్కులను లబ్ధి దారులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, శాసనసభ్యులుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గంలోని 13 మంది లబ్ధిదారులకు రూ.17.36 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు సోమవారం శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 160 మందికి రూ.1.55 కోట్లు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగస్వామి, సహా నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు శ్రీకృష్ణదేవరాయలు



విజయనగరం (చైతన్యరథం): విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీ కృష్ణదేవరాయలు నేటి పాలకులకు ఆదర్శప్రాయుడని టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు అన్నారు. సోమవారం శ్రీ కృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని కడప నగరంలోని కృష్ణా సర్కిల్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయలసీమను రతనాలసీమగా ఖ్యాతినార్జించేలా పాలన సాగించిన ధీరుడిగా శ్రీకృష్ణదేవరాయలు చరిత్రలో నిలిచిపోయారన్నారు.ఆయన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. మనమందరం శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు మురికిపాటి సునీత తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.85 కోట్లతో పర్యాటక ప్రాంతాలు సుందరీకరణ

- వి.ఎం.ఆర్.డి.ఏ పరిధిలో రూ.1.85 కోట్లతో సుందరీకరణ పనులకు శ్రీకారం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో జరుగుతున్న అంతర్జాతీయ యుద్ధ నౌకల విన్యాసాలు/సమీక్ష కార్యక్రమంలో భాగంగా వి.ఎం ఆర్.డి.ఎ పరిధిలో పలు పర్యాటక ప్రాంతాల్లో సుమారు 1.85 కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులు చేపట్టామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తెలిపారు. సోమవారం బీచ్ రోడ్‌లోని కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం, టియు 142 యుద్ధ విమాన మ్యూజియం, యుహెచ్ 3హెచ్ హెలీ మ్యూజియం, కైలాసగిరి తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయిన సుందరీకరణ, అభివృద్ధి పనులను వీరిద్దరు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖలో జరుగుతున్న ఐఎఫ్ఆర్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, బీచ్‌లో జరిగే విన్యాసాలు, కవాతు తదితర వాటిని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో నగర వాసులు, పర్యాటకులు వస్తున్న తరుణంలో పర్యాటక ప్రాంతాలు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా తీర్చిదిద్దామని అన్నారు. ఈ సందర్భంగా కైలాసగిరిపై అభివృద్ధి పనులు పరిశీలిస్తుండగా, ఇరాన్ దేశానికి చెందిన నావికాదళ అధికారులు, సిబ్బంది రావటంతో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ వారికి సాదరంగా స్వాగతం పలికారు. వారిని గ్లాస్ బ్రిడ్జి వద్దకు తీసుకువెళ్లి, గ్లాస్ బ్రిడ్జి విశిష్టతను వివరించారు. వి.ఎం.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో నడుస్తున్న పలు ముజియంల గురించి వివరించారు. ఈ సందర్భంగా మ్యూజియంలను VMRDA సమర్థంగా నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయమని నావికాదళ సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యదర్శి శ్రీ మురళీ కృష్ణ, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలిలో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి

- 15 కోట్లతో నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... ఫలించిన ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కృషి



టెక్కలి (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో 50 పడకల సామర్థ్యంతో సమగ్ర ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రూ.15 కోట్ల వ్యయంతో ఈ కీలక ప్రాజెక్టును నిర్మించేందుకు ఆయుష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కె దినేష్ కుమార్, ఐఏఎస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హాస్పిటల్ కార్యరూపం దాల్చడం పూర్తిగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి నిరంతర కృషి, దూరదృష్టి మరియు సమర్థ నాయకత్వం వల్లనే సాధ్యమైంది. జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి గరిష్ట నిధులు రాబట్టడంలో మంత్రి అచ్చెన్నాయుడు కీలక పాత్ర పోషించారు. గ్రామీణ, దూర ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు మరింత చేరువ కావాలనే సంకల్పంతో టెక్కలిని ఆయుష్ వైద్య కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ ఆసుపత్రి ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆయుష్ శాఖ అధికారులు అవసరమైన పరిపాలనా చర్యలను పూర్తి చేసి ఉత్తర్వులు ఇచ్చారు. IPHS, NAM మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభమైతే శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఆయుర్వేదం, యోగ, నేచురోపతి తదితర ఆయుష్ వైద్య సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయి. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం దిశగా మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో టెక్కలి నియోజకవర్గం ముందుకు సాగుతోందనడానికి ఇది మరో స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది.

## అనకాపల్లి స్టేడియంలో భారీ సుడిగాలి

- యువకులు క్రికెట్ ఆడుతున్న సమయంలో చోటుచేసుకున్న ఘటన



అనకాపల్లి (చైతన్యరథం): జిల్లాలో సుడిగాలి భయాందోళనకు కారణమైంది. అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం సుడిగాలి దుమారం రేపింది. సుమారు అరగంట పాటు బీభత్సం సృష్టించింది. సోమవారం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంలో కొంతమంది యువకులు క్రికెట్ ఆడుతున్న సమయంలో.. ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి.. సుడిగాలి రావటంతో యువకులు కంగారుపడిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సుమారుగా వంద అడుగుల ఎత్తులో సుడులు తిరుగుతూ, ఆకాశాన్ని తాకుతోందా అన్నట్లుగా తీవ్రంగా గాలి వీయటంతో స్థానికులు కూడా కంగారుపడిపోయారు. గతంలో ఇలాంటి పరిణామం ఎప్పుడూ చూడలేదంటున్నారు. మరోవైపు దీనినే డస్ట్ డెవిల్, టోర్నడో, ట్విస్టర్ అని వివిధ పేర్లతో కూడా పిలుస్తుంటారు. ముఖ్యంగా అమెరికాలో ఇలాంటివి చోటుచేసుకుంటూ ఉంటాయి. అయితే అమెరికాలో విరుచుకుపడే టోర్నడోలు భారీగా నష్టాన్ని కలిగిస్తూ ఉంటాయి. ప్రాణ నష్టం కూడా జరుగుతూ ఉంటుంది. ఇలాంటి సుడిగాలులు ఏర్పడటానికి అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. క్యుములోనింబస్ మేఘాలు, అలాగే మేఘాల కింద ఉండే ధూళి వంటి వ్యర్థాల నుంచి టోర్నడోలు పుట్టుకొస్తాయని చెప్తున్నారు. ఏర్పడిన చోటు నుంచి వందల కిలోమీటర్ల వేగంతో.. కొన్ని కిలోమీటర్ల దూరం ఇవి ప్రయాణిస్తాయని.. ఆ మార్గంలో విధ్వంసం సృష్టిస్తాయని వివరిస్తున్నారు. అసాధారణ స్థాయిలో వేడి పరిస్థితులు ఉన్నప్పుడు ఇలాంటి సుడిగాలులు ఏర్పడుతాయని నిపుణులు చెప్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు తేమతో కూడిన గాలి వేడెక్కి పైకి లేస్తుందని వివరిస్తున్నారు. శీతాకాలంలో గాలిలో వేడి, తేమ శాతం పెద్దగా ఉండదు కావున టోర్నడోలు వచ్చే అవకాశం తక్కువని.. ఎండాకాలంలో ఇవి ఏర్పడుతుంటాయని చెప్తున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఎక్కువగా టోర్నడోలు సంభవిస్తుంటాయి. ఇక్కడ ఏటా 140 వరకూ టోర్నడోలు ఏర్పడుతుంటాయని అంచనా. అమెరికా తర్వాత కెనడాలో ఎక్కువగా టోర్నడోలు సంభవిస్తూ ఉంటాయి. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, తూర్పు చైనా ప్రాంతాల్లోనూ ఇలాంటివి చూస్తుంటాం. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల్లోనూ ఇవి ఏర్పడుతుంటాయి.

# సమన్వయంతో ముందకెళ్తేనే సమగ్రాభివృద్ధి

## •రూ.1.20 కోట్లతో ఏలూరులో అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు (చైతన్యరథం): పాలకులతో పాటూ అధికారులు, ప్రజలు కూడా సమన్వయంతో ముందుకెళ్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. దీనిలో ప్రజాభాగస్వామ్యమే అత్యంత కీలకమని ఆయన వెల్లడించారు. ఏలూరు 18 డివిజన్‌లోని పోలీస్ కాలనీ నుండి రాజీవ్ గృహకల్పకు నాబార్డ్ నిధులు కోటి 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తోన్న బిటి రోడ్డు నిర్మాణ పనులను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్వయంగా పరిశీలించారు. తొలుత ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం రోడ్డును పరిశీలించిన ఆయన... ఇదేసమయంలో స్థానికులతో స్వయంగా మాట్లాడారు. ప్రధానంగా అక్కడి వాడకంనీటిని తమ్మిలేరులో కలిపేందుకు ఏర్పాటు చేయాల్సిన తూముల విషయంలో నెలకొన్న ఇబ్బందులును అడిగి తెలుసుకున్న ఆయన స్థానికులకు ఈ విషయంలో భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ... ఇళ్ళు నిర్మించుకునే సమయంలో తమకు నిర్దేశించబడిన స్థలంలోనే నిర్మాణాలు చేసుకుంటే ఉత్తమం అని అభిప్రాయపడ్డారు. అలాకాకుండా కొంతమంది రోడ్లపైకి, కామన్ సైట్‌లోకి అక్రమంగా భవనాలు నిర్మించేసుకుంటున్నారని, ఇటువంటి వారు భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. అలాగే ప్రజలు తమకు తెలిపిన సమస్యల్లో లైట్‌లు, డ్రైన్‌ల సమస్యలున్నాయన్న ఆయన... అన్నింటికీ పరిష్కారమార్గాలు చూపుతామన్నారు. అప్పటివరకూ కచ్చా డ్రైన్‌లు తవ్వీ, మురుగునీరు దిగువకు వెళ్ళేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, 18వ డివిజన్ కో ఇంచార్జీ నందారపు రాధా, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ,14వ డివిజన్ ఇన్‌ఛార్జ్ గొంగాడి బోసు, మాజీ ఎంపీటీసీ అంబటి రజిని,నాయకులు గొంగాడి సాంబశివరావు, బొమ్మిడి సత్యనారాయణ, లక్కోజు లలిత మరియు వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణం కోసం రైతుల ఆర్థిక సహకారం

## • ఏకంగా రూ.3.5 కోట్లు సహకారం... శకుంస్థాపన చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



భీమవరం (చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కొంతమంది రైతులు చేసిన పని ఇప్పుడు ఆదర్శంగా నిలుస్తోంది. భీమవరం - ఉండి నియోజకవర్గాలను కలుపుతూ లింక్ రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం 1.5 కోట్లు మంజూరు చేసింది. అయితే స్థానిక రైతులు కూడా 3.5 కోట్లు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వెల్లడించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్‌తో కలిసి రతన్ టాటా మార్గ్ విస్తరణకు రఘురామకృష్ణరాజు శంకుస్థాపన చేశారు. అన్నీ ప్రభుత్వమే ఏర్పాటు చేయాలంటే కష్టమని భావించారో.. లేదా ప్రభుత్వానికి మన వంతు సహకారం అందిద్దామని అనుకున్నారో తెలియదు కానీ.. రహదారి నిర్మాణం కోసం రైతులే ముందుకు వచ్చారు. చేయి, చేయి కలిపితే ఎంత పెద్ద పని అయినా సులభంగా అవుతుందనే ఉద్దేశంతో రహదారి నిర్మాణం కోసం ఏకంగా రూ.3.5 కోట్ల రూపాయలు అందిస్తున్నారు. ఈ ఆదర్శ ఘటన పశ్చిమగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. భీమవరం - ఉండి నియోజకవర్గాలను కలిపే భీమవరం లింక్ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా సోమవారం ఉదయం భీమవరం - ఉండి నియోజకవర్గాలను కలిపే రతన్ టాటా మార్గ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. రతన్ టాటా మార్గ్‌ను నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి నిధులు కూడా మంజూరయ్యాయి. ఏపీ ప్రభుత్వం కోటిన్నర రూపాయలు నిధులు మంజూరు చేయగా.. స్థానిక రైతులు మరో 3.5 కోట్లు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మొత్తం ఐదు కోట్ల రూపాయల వ్యయంతో ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. మరోవైపు రతన్ టాటా స్మారకంగా పెదఅమిరం వద్ద రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో రతన్ టాటా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ రహదారికి రతన్ టాటా మార్గ్‌గా నామకరణం చేశారు. ఈ రహదారి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే భీమవరం, ఉండి నియోజకవర్గాల మధ్య అనుసంధానం మరింత మెరుగవుతుంది.

మరోవైపు భీమవరం పట్టణానికి దక్షిణం వైపుగా బైపాస్ నిర్మించాలని ప్రభుత్వం వద్దకు ప్రతిపాదనలు చేరాయి. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఆమోదం కూడా లభించింది. ఆకివీడు సమీపంలో ఉన్న దుంపగడప వద్ద నుంచి జక్కరం మీదుగా ఉండి మండలం చెరుకువాడ, పెదపుల్లేరు మీదుగా ఈ బైపాస్ నిర్మించనున్నారు.

# సీఎంఆర్ కమిషన్ల కోసం బేరసారాలు అవాస్తవం

## •ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఖండన




విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమకు సంబంధించి ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. సీఎంఆర్ విషయంలో రాష్ట్ర మంత్రులతో మిల్లర్లు కమిషన్ల కోసం బేరసారాలు కుదుర్చుకున్నారంటూ వచ్చిన వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి సూర్య ప్రకాశరావులు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ పత్రిక తమకు అనుబంధంగా ఉన్న ఒక రాజకీయ పార్టీకి ప్రయోజనం చేకూర్చే దురుద్దేశంతోనే ఇటువంటి నిరాధారమైన ఆరోపణలతో కథనాన్ని ప్రచురించిందని వారు ఆరోపించారు.

**రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు**

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎవరితోనూ ఎటువంటి బేరసారాలు గానీ, కమిషన్ ఫిక్సింగ్‌లు గానీ జరపలేదని, మిల్లర్ల మీద ఎవరి ఒత్తిడి లేదని వారు స్పష్టం చేశారు.రైస్ మిల్లర్ల వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా ఇటువంటి కథనాలు రాయడం తగదని హితవు పలికారు.

# బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి డిజిటల్ గిఫ్ట్

## • సంజీవని ప్రాజెక్టుకు సహకారంపై గేట్స్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు (చైతన్యరథం): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినందుకు బిల్ గేట్స్ టీంకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు చేపట్టిన సంజీవని ప్రాజెక్టుకు సహకారం అందిస్తున్న బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో బిల్ గేట్స్‌తో భేటీ అయిన సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించిన ఫలితంగా ఈరోజు ఆంధ్రప్రదేశ్లో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పర్యటనకు రావటం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు సంతోషకరమైన విషయం అన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

బిల్ గేట్స్ రాక రాష్ట్రానికి గేంఛేంజర్ నాడు మైక్రోసాఫ్ట్ రాకతోనే హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి తొలి అడుగు పడి, నేడు లక్షలాది మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఈ సారి ఐటీ సహా అనేక రంగాల్లో ఏపీ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు బిల్‌గేట్స్ ముందుకు రావటం రాష్ట్ర అభివృద్ధికి "గ్రోత్ ఇంజన్" లా పని చేస్తుందనే అశాభావాన్ని వ్యక్తం చేశారు. కృత్రిమ మేధలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని, సాంకేతికత అభివృద్ధి, పరిశోధనల్లో ఏపీని పరుగులు పెట్టించాలని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లు ఆ దిశగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేసిన విషయాన్ని, గూగుల్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులకు ముందుకు రావడాన్ని ఎంపీ తన ప్రకటనలో ప్రస్తావించారు.

# పీజీఆర్ఎస్‌కు 73 వినతులు



బొబ్బిలి (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 73 వినతులు అందాయి. ఇందులో రెవిన్యూ శాఖకు చెందినవి 25 ఉండగా, 48 వినతులు ఇతర సమస్యలకు పరిష్కారం కోరుతూ వచ్చాయి. సబ్ కలెక్టర్ లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ ఎం సుధారాణి ఇందులో భాగస్వాములై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు.

**సాధారణ సమస్యలు**

కురుపాం కేటీఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల నుంచి మీసాల జ్యోతి అర్జీని అందిస్తూ, తనకు రావలసిన తల్లికి వందనం డబ్బులు వేరే ఖాతాలో జమ అయ్యాయని, కావున కాలేజీ వారిని సంప్రదించి ఆ డబ్బును తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. పార్వతీపురం మండలం పెదబొండపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నత్తల అశ్విత్ అర్జీనందిస్తూ తన తండ్రి మరణించారని, కుటుంబ పోషణ కష్టమై మందులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నందున, తనకు సికిల్ సెల్ ఎనిమియా పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

పార్వతీపురం మండలం తాళ్లబురుడి నుంచి సురాపాటి సోములు అర్జీని అందిస్తూ తన బిడ్డలకు బాలికా సంరక్షణ పథకం కింద బాండ్లను జారీచేశారని, అది మెచ్యూర్ అయి నాలుగేళ్లు అయినప్పటికీ, ఇంతవరకు నగదు రాలేదని ఫిర్యాదు చేశారు.

**రెవిన్యూ సమస్యలు**

ఎస్సీ కులానికి చెందిన తన భర్తకు 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం డి-పట్టా కింద మంజూరుచేసిన 2.50 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని, దానిని తిరిగి ఇప్పించాలని సీతానగరం మండలం లక్ష్మీపురం నుంచి మండంగి సుశీల కోరారు. పార్వతీపురం నుంచి గరుగుబిల్లి వినయ్ బాబు అర్జీ అందిస్తూ తన తాతకు చెందిన ఎకరా భూమి పంపకాలు చేసుకోవలసి ఉన్నందున, తాత పత్తిక జోగయ్య మరణ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలం చిలకాం నుంచి దాసరి సత్తమ్మ వినతి పత్రం అందిస్తూ తన తండ్రి మరణానంతరం దాఖలాపడిన భూములను జిరాయితీ భూములుగా తమకు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో నమోదు అవుతున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలను ప్రోత్సహించండి... రైతు ఆదాయాన్ని పెంచండి

**◆వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలి**

**◆వ్యవసాయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ**



వినుకొండ (చైతన్యరథం): ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం కల్పించవచ్చని ఆ దిశగా వ్యవసాయ శాఖ ఉద్యోగులు పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ఉద్యోగులతో సోమవారం తన కార్యాలయం నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ... తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందటానికి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం చాలా అవసరం అన్నారు. గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉద్యాన పంటసాగు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో పండ్ల తోటల సాగుకు సారవంతమైన భూములు ఉన్నాయని, బోర్లు, బావులు నీటి వనరు ఉన్న భూముల్లో ఉద్యాన పంట సాగుకు రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, పూల తోటల సాగుకు ప్రభుత్వం ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా రాయితీలు అందిస్తుందని, మొక్కలు, డ్రిప్ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందజేస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచి క్షేత్రస్థాయిలో ఉద్యాన పంట సాగును పెంచే విధంగా పనిచేయాలన్నారు. పండ్లు, కూరగాయల పంట సాగుతో ఎకరానికి 2 నుంచి 3 లక్షల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయి వ్యవసాయ ఉద్యోగులు అవకాశం ఉన్న ప్రాంతాల్లో రైతుల చేత ఉద్యాన పంటలు వేయించి అధిక ఆదాయాన్ని పెంచి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆ దిశగా పయనిస్తుందన్నారు. ఉద్యాన పంట సాగును పెంచడంలో బాధ్యతగా పనిచేసే, ప్రతిభను కనపరిచిన ఉద్యోగులను అవార్డులు, క్యాష్ రివార్డులతో ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.


# విజన్ 2047 వైపు దూసుకెళ్తున్న ఆర్థిక సంస్కరణల బడ్జెట్

**◆కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం ప్రకటన**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని దీర్ఘకాలిక అభివృద్ధి పథంలో నడిపించే దిశానిర్దేశక ఆర్థిక సంస్కరణల పత్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం లెక్కల పత్రం కాదు, ప్రజల భవిష్యత్తును రూపుదిద్దే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అని అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సాగునీరు, విద్య, ఆరోగ్యం, పంచాయతీరాజ్, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలకు సముచిత కేటాయింపులు చేయడం ద్వారా ప్రభుత్వం సమతుల్య అభివృద్ధి దిశగా అడుగులు వేసిందన్నారు. వెనుకబడిన వర్గాల సాధికారతకు ప్రత్యేక నిధులు కేటాయించడం సామాజిక న్యాయానికి నిదర్శనమని తెలిపారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన అభినందించారు. రాష్ట్ర భవిష్యత్ వృద్ధికి అవసరమైన మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం అభివృద్ధి దృక్పథానికి నిదర్శనమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.18,224 కోట్లు కేటాయించడం రైతుల సంక్షేమంపై ప్రభుత్వ కట్టుబాటును స్పష్టం చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు కేటాయించడం రైతులకు ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ.11,000 కోట్లు కేటాయించడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుందని చెప్పారు. పేదల గృహావసరాలను తీర్చేందుకు గృహనిర్మాణానికి రూ.6,357 కోట్లు కేటాయించడం సామాజిక భద్రతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. మొత్తం సంక్షేమ కార్యక్రమాలకు రూ.91,527 కోట్లు కేటాయించగా, బీసీలకు రూ.51,021 కోట్లు, ఎస్టీలకు రూ.9,190 కోట్లు, మైనార్టీలకు రూ.6,090 కోట్లు, మహిళా-శిశు-వికలాంగుల సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించడం సమగ్రాభివృద్ధి లక్ష్యానికి అనుగుణమని వివరించారు.

# సమగ్రాభివృద్ధికి దిశానిర్దేశం చేసే బడ్జెట్ : ఎమ్మెల్యే బొండా



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు అన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బడ్జెట్పై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువత, మహిళలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో విద్య, సామాజిక భద్రతను బలోపేతం చేశామన్నారు. ఇరిగేషను సుమారు రూ.20 వేల కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రధానంగా బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా పని చేస్తామన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రూ.13 లక్షల కొట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం గర్వకారణమని అన్నారు.

# ఇది ప్రగతి సాధక ప్రజా బడ్జెట్ : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): జగ్గయ్యపేట పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ నివాసంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్‌పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ... ఈ బడ్జెట్ కోట్లాది ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ అని, మాటల కోసం కాకుండా ప్రగతి కోసం రూపొందించిన బడ్జెట్ అని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశను చూపే విధంగా ప్రజల ఆశలు--ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సాగునీరు, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ రంగాలను బలోపేతం చేసే విధంగా నిధులు కేటాయించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్ ఇది అని అన్నారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.18,224 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో గృహనిర్మాణానికి రూ.6,357 కోట్లు కేటాయించారని తెలిపారు. సంక్షేమానికి మొత్తం రూ.91,527 కోట్లు కేటాయించగా, బీసీల అభివృద్ధికి రూ.51,021 కోట్లు, ఎస్టీలకు రూ.9,190 కోట్లు, మైనార్టీలకు రూ.6,090 కోట్లు, మహిళా-శిశు--వికలాంగుల సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించారని వివరించారు. విద్యా రంగానికి భారీ ప్రాధాన్యం ఇస్తూ పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధికి గణనీయ నిధులు కేటాయించారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.22,942 కోట్లు, వైద్యశాఖకు రూ.19,306 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ.11,000 కోట్లు కేటాయించారని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు కేటాయించడం రైతులకు పెద్ద ఊరట కలిగిస్తుందని అన్నారు.

# పొట్టేలు పందేలు ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణం 8వ వార్డు రైతు పేటలోని శ్రీ విజ్ఞాన నందీశ్వర మహా లింగేశ్వర ఆలయంలో స్వయంభు శివలింగానికి కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన పొట్టేలు పందాలను రైతులతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ పొట్టేలు పందాలు భక్తులు, స్థానిక ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. రైతుల ఆచారాలు, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ఆలయ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, ప్రజలందరికీ శివుని కృప కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభం




ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసుల కల నెరవేరబోతోంది. కొత్త రైల్వే జోన్‌కు సంబంధించి అపాయింటెడ్ డేకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని కుదిరితే ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే విభజన ప్రక్రియలో భాగంగా.. ఆరు డివిజన్లు విడిపోతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లు మాత్రమే ఉంటాయి. కొత్తగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు కాబోతోంది.. అందులో కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్, తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కలిపి ఉంటాయి. కొత్తగా ఏర్పాటవుతున్న రైల్వే జోన్‌కు ఏప్రిల్ 1న అపాయింటెడ్ డేగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటి నుంచి చూస్తే ఆరు వారాల సమయం ఉంది.. మరి అంత తక్కువ సమయం సరిపోతుందా అనే అంశంపై కూడా తెరపైకి వచ్చింది. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ వస్తుందని.. ఈ నెలాఖరు లోపు కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు. రైల్వే బోర్డుకు తొమ్మిది నెలల క్రితమే డివిజన్ల వారీగా విభజన ప్రక్రియతో పాటుగా మిగిలిన అంశాలపై డీపీఆర్ పంపించారు. ఈ మేరకు విభజన ప్రక్రియను చేపట్టారు. ఈ నెలలోనే అపాయింటెడ్ డే ప్రకటిస్తారని భావిస్తున్నారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గత పదేళ్లుగా కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రం నుంచి వినతులు అందజేశారు. గతేడాది ఫిబ్రవరి నెలలో కేంద్ర కేబినెట్ కొత్త రైల్వే జోన్‌కు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

# ట్యాంకు బండ్‌గా మార్కాపురం చెరువు అభివృద్ధి

**మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి వెల్లడి**



మార్కాపురం(చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని అత్యంత కీలకమైన చెరువు కట్టపై ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు 4 కోట్ల రూపాయల అంచనాతో శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రజలు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ నాలుగు కోట్ల రూపాయలతో ఈ రోడ్డును అభివృద్ధి చేయడం జరుగుతుందని త్వరలోనే మరిన్ని నిధులు ఈ రోడ్డుకు కేటాయించి మార్కాపురం చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ పట్టణ తెలుగుదేశం నాయకులు, ఆర్ అండ్ బి అధికారులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాయవరం రైల్వే స్టేషన్ వద్ద మహాశివరాత్రి పండుగ సందర్భంగా రైల్వే స్టేషన్ టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ప్రయాణికులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# బడుగులకు బాసటగా బడ్జెట్‌లో కేటాయింపులు

**మీడియా సమావేశంలో టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు**



యర్రగొండపాలెం(చైతన్యరథం): రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా, భవిష్యత్ కు భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందని యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. 2026-2027 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ పై మీడియా సమావేశంలో ఎరిక్షన్ బాబు మాట్లాడారు. స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా వేసిన బలమైన అడుగు ఈ బడ్జెట్ అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, జల వనరులు, రహదారులు, పట్టణ పరిపాలన, పర్యాటకం వంటి శాఖలకు భారీగా నిధులు కేటాయించడం అభివృద్ధి, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

ముఖ్యంగా బడ్జెట్ లో సాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రూ. 18,224 కోట్లు కేటాయించడం శుభ పరిణామమని, వెలుగొండ ప్రాజెక్టు కల త్వరలోనే సాకారమవుతుందని అన్నారు. సామాన్యుల అవసరాలు మొదలు రాష్ట్ర దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు నిధుల కేటాయింపుపై బడ్జెట్ లో ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. బడ్జెట్ కేటాయింపుల ద్వారా పీపుల్స్ ఫస్ట్ అనే వాస్తవికతను ప్రజల కళ్లకు కట్టారని అన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజల ఆకాంక్షలను ఆవిష్కృతం చేసేలా బడ్జెట్ రూపొందించిన మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎరిక్షన్ బాబు ధన్యవాదాలు తెలిపారు.

# ట్రై సైకిళ్ళు, డస్ట్‌బిన్ల పంపిణీ

**కార్యక్రమానికి పచ్చ జెండా ఊపిన ఎమ్మెల్యే ముత్తుముల**

గిద్దలూరు, (చైతన్యరథం): మార్కాపురం జిల్లా గిద్దలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని పచ్చ జెండా ఊపి ట్రై సైకిల్స్ డస్ట్ బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. మన గిద్దలూరు మండలానికి 35 రిక్షాలు, గ్రీన్ అంబాసిడర్ అయిన మీరు మీకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతి ఒక్కరూ 250 గృహాల నుండి చెత్త సేకరించి పరిశుభ్రంగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణాలు శుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో ముందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.





కనిగిరిలో జరిగిన మీడియా సమావేశంలో బడ్జెట్‌పై మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

# దేశవాళీ పశువుల్ని కాపాడుకోవాలి

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**



రాప్తాడు (చైతన్యరథం): ఇటీవల కాలంలో దేశవాళి పశువులు కనిపించకుండా పోతున్నాయని.. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశవాళి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎద్దులతో ఈ పోటీలకు తరలివచ్చారు. గ్రామంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు సాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నాగ నందీశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోటీలను వీక్షించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. మొదటి బహుమతి కర్నూలు జిల్లా జొన్నగిరి మండలానికి చెందిన అద్దంకి మస్తానీ యాదవ్ 30వేలు, 2వ బహుమతి విడపనకల్లు మండలం పెంచలపాడుకు చెందిన రాకెట్ల బీమ లింగప్పకు 25వేలు, 3వ బహుమతి బొమ్మనహాళ్ మండలం లింగదాలకు చెందిన ఎర్రి స్వామికి 20వేలు, 4వ బహుమతి బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాల్ కు చెందిన బసన్నకు 15వేలు, 5వ బహుమతి ఉరవకొండ మండలం కౌకుంట్లకు చెందిన గాలి సీనప్పకు 10వేలు, 6వ బహుమతి వజ్రకరూరు మండలం ధర్మపురికి చెందిన అజిత్ కుమార్ కు 8వేలు, 7వ బహుమతి కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన మాధవరాజుకు 5వేలు, 8వ బహుమతి ఆత్మకూరు మండలం బి.యాలేరుకు చెందిన నాగరాజుకు 3వేల రూపాయల చొప్పున ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న దేశవాళి ఎద్దుల యజమానులకు సన్మానం చేసి రెండు రాగి గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సాంప్రదాయ పోటీలు నిర్వహించడం వలన మంచి స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు. అలాగే పశువుల పెంపకాన్ని ప్రోత్సహించినట్టు అవుతుందన్నారు. ముఖ్యంగా దేశవాళి పశువుల వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని.. ఇటీవల ఇతర జాతి పశువుల పెంపకం ఎక్కువగా చూస్తున్నామన్నారు. పాడి రైతులందర్నీ దేశవాళి ఆవుల పెంపకం చేపట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

## గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య రానివ్వద్దు

వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. రానున్న మూడు నెలల్లో ఎక్కడైన సమస్యలు వచ్చే అవకాశం ఉందా.. వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాల గురించి చర్చించారు. జల జీవన్ మిషన్ నిధులతో పీఏబీఆర్ నుంచి చేపట్టిన తాగునీటి పైప్ లైన్, ట్యాంకుల నిర్మాణాల పనులు ఎక్కడివరకు వచ్చాయన్నది వివరాలు అడిగారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్య గురించి అసెంబ్లీలో ప్రస్తావించామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరామన్నారు. ఇందుకు సంబంధించిన మంత్రిని కూడా కలిసి నివేదిస్తామన్నారు. త్వరలోనే ఈ నిధులు వచ్చే అవకాశం ఉందని.. ఈ పనులు పూర్తి చేస్తే రెండు మండలాల్లో దాదాపు నీటి సమస్య ఉండదన్నారు. ఇవి కాకుండా ఇంకా ఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది.. ఎక్కడైనా నిధులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొస్తామన్నారు. దీనిపై ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అలాగే గ్రామాల వారిగా ఏమైనా పనులు పెండింగ్ లో ఉన్నాయా అన్నది కూడా ఒక నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న సిసి రోడ్ల పనుల గురించి ఎంపీడీఓలనడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా ఆ పనులు పూర్తి కావాలని ఆదేశించారు



# రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి బ్లూప్రింట్

## బడ్జెట్‌పై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వరరెడ్డి



ఎమ్మిగనూరు, (చైతన్యరథం): పట్టణంలోని ఆర్ ఆండ్ బీ గెస్ట్ హౌస్‌లో 2026, 2027 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వరరెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"ఈ బడ్జెట్ గణాంకాల పుస్తకం మాత్రమే కాదు, కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విజన్ డాక్యుమెంట్. రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశా, దశా చూపించే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టబడింది" అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సాగునీరు, విద్య, వైద్యం, పర్యాటకం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం వంటి రంగాల బలోపేతానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. మొత్తం రూ. 3,32,205 కోట్లతో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రిని ఎమ్మెల్యే అభినందించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 13,598 కోట్లు పాఠశాల విద్యకు, రూ. 32,308 కోట్లు, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు రూ. 27,719 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ. 11,000 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు, రూ. 6,357 కోట్లు, వైద్య శాఖకు, రూ. 19,306 కోట్లు, పౌర సరఫరా శాఖకు, రూ. 3,821 కోట్లు, పురపాలక శాఖకు, రూ. 14,538 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 6,600 కోట్లు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం 12.3 శాతం వడ్డీతో అప్పులు చేయగా, కూటమి ప్రభుత్వం ఆ వడ్డీ రేటును 9శాతానికి తగ్గించడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాల బలోపేతంతో పాటు యువతకు ఉపాధి కల్పించే పెట్టుబడులను ఆకర్షించేలా బడ్జెట్ రూపొందించబడిందని పేర్కొన్నారు. విషన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే దిశగా ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కుర్నీ కార్పొరేషన్ చైర్మన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, ఏఎంసీ చైర్మన్, మండల పట్టణ కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన బడ్జెట్

## డోన్ శాసనసభ్యుడు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

డోన్ (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డోన్ శాసనసభ్యుడు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాత్రికేయులతో సమావేశమై రాష్ట్ర బడ్జెట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్ భవిష్యత్తు తరాలకు దిశానిర్దేశం చేసే పథకరూపం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సాధారణ ఆర్థిక లెక్కల సమాహారం మాత్రమే కాదని, ప్రజల ఆశలు ఆకాంక్షలకు ప్రతిబింబంగా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచే విధంగా రూపొందించబడిన కార్యాచరణ ప్రణాళిక అని అన్నారు. గ్రామీణాభివృద్ధి నుంచి పట్టణాభివృద్ధి వరకు అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి, అనుబంధ రంగాలకు గణనీయమైన నిధులు కేటాయించడం ద్వారా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు రక్షణ కల్పించడం, సాగునీటి ప్రాజెక్టులకు పెరిగిన కేటాయింపులు చేయడం వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతాయని చెప్పారు. పేదల గృహనిర్మాణానికి అధిక నిధులు కేటాయించడం ద్వారా సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక కేటాయింపులు చేయడం సామాజిక న్యాయం సాధనకు దోహదమని తెలిపారు. విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, పంచాయతీరాజ్, పురపాలక రంగాలకు తగిన నిధులు కేటాయించడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విజన్ 2047 లక్ష్యంతో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దృఢంగా ముందుకు తీసుకెళ్లే బడ్జెట్ ఇదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# వైభవంగా ఆది దంపతుల కళ్యాణం



నెల్లూరు(చైతన్యరథం): నెల్లూరు సిటీ 47వ డివిజన్‌లోని కంసాలివీధి, గుప్తాపార్క్ సెంటర్‌లో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ హరి హరనాథస్వామి వారి దేవస్థానంలో సోమవారం సాయంత్రం శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాలయ ఉభయకర్తలు అంబూరు మునీంద్ర, అంబూరు మురళి ఆయనకు ఘన స్వాగతం పలికారు. విజయభాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు సిటీ 47వ డివిజన్ ప్రజలందరిపై ఆ పరమేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, మంత్రి నారాయణ నాయకత్వంలో నగరం దేశస్థాయిలో అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిటికల్ టీం సభ్యులు, దేవాలయ మిత్రమండలి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు దేవాలయ మిత్రమండలి ప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిటాల చొరవతో ప్రశాంతంగా కాటకోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

## సహకరించిన గ్రామ పెద్దలకు, పోలీసులకు కృతజ్ఞతలు



ధర్మవరం, (చైతన్యరథం): గత కొన్నేళ్లుగా వివాదాలు, ఉద్రిక్తతలకు కేంద్రంగా మారిన చిల్లవారిపల్లి కాటకోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, ఈసారి ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి సమీపంలో శ్రీ కాటకోటేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండు రోజుల పాటు కొన్ని గ్రామాల ప్రజలు, పలు సామాజిక వర్గాల వారు సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అయితే గత కొన్నేళ్లుగా ఉత్సవాల నిర్వహణలో విబేధాలు వచ్చాయి. దీంతో కొన్ని గ్రామల మధ్య, సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు ఏర్పడి. చాలా సార్లు ఘర్షణలు జరిగి, ఉద్రిక్త పరిస్థితులు కనిపించేవి. ఈ పరిస్థితిని గమనించిన పరిటాల శ్రీరామ్ గత ఏడాదిలోనే అందర్నీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈసారి వేడుకలకు 10రోజుల ముందు నుంచే శ్రీరామ్ స్వయంగా రంగంలోకి దిగి.. అభ్యంతరాలు చెబుతున్న వారితో మాట్లాడారు. గ్రామాల పెద్దల్ని, ఆలయ పూజార్లందర్నీ ఏకతాటిపైకి తీసుకొచ్చారు. దీనికి తోడు డీఎస్పీ హేమంత్ కుమార్ కూడా ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ విషయంలో చొరవ చూపారు. దీంతో రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. ఆదివారం చిల్లవారిపల్లి నుంచి స్వామివారి ఆభరణాలను గుర్రాలపై, ఎలవగంపలో ఉంచి కాటకోటేశ్వర క్షేత్రానికి బయలు దేరి సోమవారం తెల్లవారు జామునకు కాటకోటేశ్వర క్షేత్రానికి చేరుకున్నాయి. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి గుర్రములతో భక్తుల అగ్నిగుండ ప్రవేశం ఘనంగా జరిగింది. ఈవేడుకల్ని తిలకించడానికి శ్రీసత్యసాయి, అనంతపురం, కడప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల వివాదాల నేపథ్యంలో ఎస్పీ సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో సాంప్రదాయబద్ధంగా అందరూ ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించుకునే వారన్నారు. అయితే దురదృష్టవశాత్తు కొన్ని విబేధాలు రావడంతో అనుకోని సంఘటనలు జరిగాయన్నారు. ఈసారి ఇలాంటి వాటికి తావివ్వకూడదని పెద్దలందరితోను మాట్లాడామన్నారు. అందరూ ఐక్యంగా ఉత్సవాల నిర్వహణకు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఇందులో పోలీస్ శాఖ వారు సుమారు వారం రోజులుగా ఇక్కడే ఉండి.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చేశారన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డీఎస్పీ హేమంత్ కుమార్ కి గ్రామస్థులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి చిల్లవారిపల్లి కాట కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఒక ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతాయని శ్రీరామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# వందే భారత్ స్లీపర్, అమృత్ భారత్ రైళ్లలో ఎమర్జెన్సీ కోటా పునరుద్ధరణ



వందే భారత్ స్లీపర్, అమృత్ భారత్ ట్రెయిన్స్‌లో ఎమర్జెన్సీ కోటాను రైల్వే శాఖ పునరుద్ధరించింది. గతంలో ఈ రైళ్లల్లో మహిళలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, డ్యూటీ పాస్ హోల్డర్లకు మాత్రమే ప్రత్యేక కోటాలు అందుబాటులో ఉండేవి. అయితే, ప్యాసెంజర్ల అవసరాలు, బెర్తుల లభ్యత, కార్యనిర్వహణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ కోటాను పునరుద్ధరించేందుకు నిర్ణయించింది. అత్యవసర జర్నీలకు అనుగుణంగా ఎమర్జెన్సీ కోటా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖ అన్ని జోనల్ శాఖలను ఆదేశించింది. ఇందుకు సంబంధించి సవివరమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, ఏడు లేదా అంత కంటే ఎక్కువ స్లీపర్ క్లాస్ బోగీలు ఉన్న అమృత్ భారత్ రైళ్లల్లో ఇరవై నాలుగు ఎమర్జెన్సీ బెర్తులను అందుబాటులో ఉంచాలి. ఇక వందే భారత్ స్లీపర్ రైళ్లల్లోని ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీల్లో సాధారణ రోజుల్లో నాలుగు ఎమర్జెన్సీ బెర్తులు అందుబాటులో ఉంచాలి. వారాంతాల్లో ఆరు ఎమర్జెన్సీ బెర్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇక సెకెండ్ క్లాస్ ఏసీ కోచ్‌లల్లో సాధారణ రోజుల్లో ఇరవై నాలుగు బెర్తులు, వారాంతాల్లో 30 బెర్తులు అందుబాటులో ఉంచాలి. ఇక థర్డ్ క్లాస్ ఏసీ బోగీల్లో సాధారణ రోజుల్లో 24 బెర్తులు, వారాంతాల్లో 42 బెర్తులు ఎమర్జెన్సీ కేటగిరీగా అందుబాటులో ఉంచాలి. నిబంధనల మేరకు అత్యవసరమైన సందర్భాల్లో ప్రయాణించేందుకు ఈ కోటాను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. మెడికల్ ఎమర్జెన్సీలు, అధికారిక విధుల్లో భాగంగా అత్యవసర ప్రయాణాలు, కుటుంబ ఎమర్జెన్సీలు తలెత్తినప్పుడు వీటిని వినియోగించుకోవచ్చు. సాధారణంగా ఉన్నతాధికారులు ఈ కోటాను వినియోగిస్తారు. అయితే, సాధారణ ప్రయాణికులు కూడా తగు డాక్యుమెంట్స్‌తో ఈ కోటాలో జర్నీ చేయొచ్చు. ఈ ఎమర్జెన్సీ బెర్తులను బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సదుపాయం లేదు. జర్నీకి కనీసం ఒక రోజు ముందు సంబంధిత అధికారులకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. అన్ని తనిఖీలూ పూర్తయ్యాకే అనుమతి జారీ అవుతుంది.



# భారత్ వేగవంతమైన వృద్ధికి ఏఐ సమ్మిట్ నిదర్శనం: ప్రధాని

భారత్ వేగవంతమైన వృద్ధికి ఏఐ సమ్మిట్ నిదర్శనమని, ప్రపంచ అభివృద్ధిలో సహకారాన్ని అందించేందుకు భారత్ ముందడుగు వేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం ఫిబ్రవరి 20వ తేదీవరకూ వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 జరగనుంది. భారత్ వేగవంతమైన అభివృద్ధికి ఏఐ సమ్మిట్ నిదర్శనమని, ప్రపంచ అభివృద్ధిలో సహకారాన్ని అందించేందుకు భారత్ ముందడుగు వేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం (ఫిబ్రవరి 20) వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 జరగనుంది. ఈ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రపంచ నాయకులను, ప్రతినిధులను, పరిశ్రమల నాయకులను స్వాగతించారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) అనే థీమ్‌తో జరుగుతున్న ఈ సమ్మిట్ గురించి ప్రధాని మాట్లాడుతూ ప్రపంచ దేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును వినియోగించుకోవడం మన ఉమ్మడి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఇది ప్రగతిశీల భవిష్యత్తును రూపొందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ సమ్మిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరుగుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. కాగా, శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మిట్‌లో 45 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారు.

# బరితెగించిన డిప్యూటీ బ్యాంకు మేనేజర్

## ఏకంగా రూ.3.5 కోట్ల విలువైన బంగారం చోరీ



బెంగళూరులో ఓ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ బరితెగించాడు. బెట్టింగ్ పిచ్చితో కస్టమర్లను దారుణంగా మోసం చేశాడు. బ్యాంకు లాకర్ల నుంచి ఏకంగా రూ.3.5 కోట్ల విలువైన బంగారాన్ని దొంగిలించాడు. ఆ బంగారంతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు ఆడాడు.. ఈ సంఘటన కర్ణాటకలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని ఓ బ్యాంక్‌లో పని చేస్తున్న డిప్యూటీ మేనేజర్ ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిస అయ్యాడు. బెట్టింగ్‌లు ఆడటానికి డబ్బుల కోసం కన్నింగ్ ప్లాన్ వేశాడు. తను పని చేసే బ్యాంక్ లాకర్లలోని బంగారాన్ని టార్గెట్ చేశాడు. ఉన్నతాధికారులకు తెలియకుండా లాకర్లనుంచి ఏకంగా 2.7 కేజీల బంగారాన్ని దోచేశాడు. ఆ బంగారాన్ని ఓ ఫినాన్స్ కంపెనీలో తనఖా పెట్టాడు. వచ్చిన డబ్బులతో ఆన్‌లైన్‌లో బెట్టింగులు ఆడాడు. బ్యాంకు లాకర్ల నుంచి పెద్ద మొత్తంలో బంగారం పోయిందని గుర్తించిన చీఫ్ మేనేజర్.. గిరి నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిబ్రవరి 5వ తేదీన దొంగతనంపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు డిప్యూటీ మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడు రూ.3.5 కోట్ల విలువ చేసే బంగారాన్ని దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి 700 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారాన్ని కూడా రాబట్టే పనిలో పడ్డారు. ఈ సంఘటనపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లోకేశ్ బీ జగలసార్ మాట్లాడుతూ.. 'ఈ కేసుకు సంబంధించి డిప్యూటీ బ్యాంక్ మేనేజర్‌ను అరెస్ట్ చేశాం. బంగారాన్ని రికవరీ చేసే పనిలో ఉన్నాం. ఇప్పటి వరకు 700 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశాం. ఫినాన్స్ కంపెనీ వాళ్లు మాకు సరిగా సహకరించటం లేదు. మేము కోర్టు ద్వారా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

# అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం!

కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై 9 మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 7 నుంచి విచారణ చేపట్టనుంది. మందిరంలోకి 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు శబరిమల శ్రీ ధర్మశాస్త ఆలయం దశాబ్దాలుగా నిరాకరిస్తోంది. దీనికి 2018లో అత్యున్నత న్యాయస్థానం స్వస్తి చెప్పింది. అన్ని వయస్సుల వారికి ప్రవేశం కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించేందుకు 2020 ఫిబ్రవరి 10న సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ నేపథ్యంలో సంబంధిత పార్టీలు తమ వాదనలను మార్చి 14 లోగా అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 'తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం శబరిమల సమీక్ష కేసుపై ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విచారణ జరుపుతుంది. ఏప్రిల్ 22 వరకూ రెండు వారాల పాటు విచారణకు సమయం కేటాయిస్తున్నాం. రివ్యూ పిటిషనర్లు, వారికి సపోర్ట్ చేసే పార్టీ వాదనలను ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 9 వరకూ విచారిస్తుంది. రివ్యూను వ్యతిరేకించే వారి పిటిషన్లను ఏప్రిల్ 14 నుంచి ఏప్రిల్ 16 వరకూ వింటాం' అని సుప్రీంకోర్టు తెలిపింది. రిజాయిండర్ సబ్మిషన్లు ఉంటే ఏప్రిల్ 21న వింటామని పేర్కొంది.

## సమీక్షకు మద్దతు ప్రకటించిన కేంద్రం

కాగా, పిటిషన్లపై సమీక్షకు తాము మద్దతిస్తున్నట్టు కేంద్రం సోమవారంనాడు ప్రకటించింది. ఈ అంశంపై కేరళలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ సారథ్యంలోని యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) డిమాండ్ చేసింది.

# బీజేపీ నేత క్షమాపణలు

టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను విమర్శించే క్రమంలో నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ క్షమాపణలు తెలిపారు. ఎవరినీ బాధ పట్టే ఉద్యేశం తనకులేదని, పొరపాటున ఈ వ్యాఖ్యలు చేశానని, అందుకు చింతిస్తున్నానని చెప్పారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. అయితే ఆరోజు తాను ఆ నిబంధనను అతిక్రమించానని తెలిపారు. దీనిపై వివాదం రేగడంతో బీజేపీ కోయంబత్తూరు (సౌత్) ఎమ్మెల్యే వనతి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తనతో ఈ విషయం చర్చించారని, తాను అన్న మాటలకు చింతిస్తున్నానని నాగేంద్రన్ తెలిపారు.

# కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం : ఏడుగురి సజీవదహనం

రాజస్థాన్‌లో భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు అందులోనే చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా ఫ్యాక్టరీలో చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించారు. ప్రమాద స్థలంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సుమిత్ర మిశ్రా తెలిపారు.



# నార్త్ కొరియా..అత్త వర్సెస్ కోడలు!



ఉత్తర కొరియాలో కుటుంబ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పరిస్థితి అత్త వర్సెస్ కోడలిగా మారింది. సౌత్ కొరియా నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కథనం ప్రకారం.. ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన స్థానంలో కూతురు కిమ్ జు యేను దేశాధి నేతను చేయాలని చూస్తున్నారు. కిమ్ జు యే వయసు ప్రస్తుతం 13 ఏళ్లు. కొన్నేళ్ల నుంచి ఆమె తండ్రితో కలిసి హై ప్రొఫైల్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో చైనా లోని బీజింగ్‌లో జరిగిన కార్యక్రమానికి కూడా తండ్రితో కలిసి వెళ్లారు. మరికొన్ని రోజుల్లో ఉత్తర కొరియాలో అతిపెద్ద, ముఖ్యమై న రాజకీయ సమ్మేళనం జరగబోతోంది. ఈ రాజకీయ సమ్మేళనంలో తండ్రితో కలిసి కిమ్ జు యే కూడా పాల్గొనే అవకాశం ఉంది. 2022లో మొదటిసారి కిమ్ జు యే తండ్రితో కలిసి పబ్లిక్ ఈవెంట్‌లో కనిపించారు. ఆ ఏడాది నవంబర్ నెలలో జరిగిన లాంగ్ రేంజ్ మిస్సైల్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఇక అప్పటినుంచి తరచూ తండ్రితో కలిసి పబ్లిక్ ఈవెంట్స్‌లో పాల్గొంటూనే

### వేడెక్కుతున్న కుటుంబ రాజకీయాలు

ఉన్నా రు. ఆయుధాల టెస్ట్‌లు, మిలిటరీ పరేడ్స్, ఫ్యాక్టరీ విజిట్స్ ఇలా అన్ని చోట్లకు వెళుతున్నారు. కిమ్ జోంగ్ ఉన్ తన కూతుర్ని దేశాధినేతను చేయడానికే ఇలా అన్ని చోట్లకూ తీసుకెళు తున్నారని సౌత్ కొరియా నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చెప్పుకొచ్చింది.

**అత్త వర్సెస్ కోడలు..**

ఉత్తర కొరియాలో అధినేత కిమ్ జోంగ్ ఉన్ తర్వాత శక్తివం తమైన లీడర్ ఎవరైనా ఉన్నారంటే అది కచ్చితంగా కిమ్ యో జంగ్ అనే చెప్పాలి. 38 ఏళ్ల కిమ్ యో జంగ్‌కు రాజకీయ పరంగానే కాకుండా మిలిటరీ పరంగా కూడా పట్టు ఉంది.

ప్రస్తు తం ఆమె వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియాలో కీలక పదవిలో ఉన్నారు. సోదరుడిపై కూడా ఆమె ప్రభావం చాలా ఉంది. అవకాశం ఉందని తెలిస్తే దేశాధినేత పదవిని సొంతం చేసుకోవడానికి కిమ్ యో జంగ్ ఏమాత్రం ఆలోచించదని సౌత్ కొరియన్ ఇంటెలిజెన్స్ అధికారి రా జోంగ్ ఇల్ తెలిపారు. పదవిని సొంతం చేసుకోకుం డా ఆమెను అడ్డుకోవటం కష్టమని తేల్చి చెప్పారు.

# ‘ఏరియా 51’.. ఆ ప్రాంతం గురించి తెలుసా?



అమెరికాలోని నెవాడాలో ఉన్న ‘ఏరియా 51’ ప్రాంతం గురిం చి రకరకాల పుకార్లు వినిపిస్తుంటాయి. నెవాడా ఎడారిలో దాదాపు 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ‘ఏరియా 51’ ప్రాంతంలో గ్రహాంతర జీవులను అమెరికా నిర్బంధించిందని చాలా మంది నమ్ముతుంటారు. ఈ ప్రాంతం పూర్తిగా అమెరికా సైన్యం ఆధీనం లో ఉంటుంది. అక్కడ అమెరికా సైన్యం, శాస్త్రవేత్తలు రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. సరికొత్త ఆయుధాలను పరీక్షిస్తుంటారు. ఆ ప్రాంతంలో ఏలియన్స్ కూడా ఉన్నాయని వార్తలు వస్తుంటా యి.

‘ఏరియా 51’ ప్రాంతంలో ఏలియన్స్ ఉన్నాయనే వార్తలపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా స్పందించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ‘ఏదో ఒక గ్రహంపై ఏలియన్స్ ఉంటాయని నేను బలంగా నమ్ముతున్నా. కానీ, ఏలియ న్స్‌ను ‘ఏరియా 51’లో బంధించారనే ఊహాగానాల్లో నిజం లేదు.

దానిని నిరూపించే ఆధారాలేవీ లేవు. నేను అధికారం లో ఉన్నప్పుడు కూడా నాకు అలాంటి సమాచారం లేదు’ అని ఒబామా స్పష్టం చేశారు. మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై గ్రహాంతర వాసుల ఉనికి కనిపించిందని, వాటిని యూఎస్ ఎయిర్ ఫోర్స్ రీపర్ డ్రోన్లు పదేళ్ల క్రితం రికార్డ్ చేశాయని పలు నివేదికలు వెల్లడించాయి. అయితే గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించి అమెరికా దగ్గర రికార్డులు ఉన్నట్టు తాను నమ్మడం లేదని ఒబామా చెబుతున్నారు.

## బంగ్లాలో కొత్త ప్రభుత్వం..

# సారథి పయనం ఎటు?



బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బీఎస్పీ చైర్మన్ తారిఖ్ రెహమాన్.. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతు న్నారు. తన క్యాబినెట్ కూర్పుపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇప్పటివరకు బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక సారథిగా వ్యవహరించిన మహ్మద్ యూనస్ తదుప రి పయనం ఎటువైపు అనే విషయం ఆసక్తిగా మారింది. క్లిష్ట సమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ఆయన, నూతన ప్రభుత్వంలో భాగస్వామి అవుతారా? ప్రత్యేక బాధ్యతలు అందు కుంటారా? అన్న విషయంపైనా చర్చ జరుగుతోంది. ఉద్రిక్తతల వేళ మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వీడిన తర్వాత.. 2024 ఆగస్టులో తాత్కాలిక ప్రభుత్వానికి సారధిగా (ముఖ్య సలహాదారు) మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. దేశం అత్యంత అస్థిర పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ఓ ప్రభుత్వ సంరక్షకుడిగా కొనసాగిన ఆయన.. 19 నెలల పాటు తన విధులను నిర్వర్తించా రు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకంగా వ్యవహరించారు. అవే కాకుండా రాజకీయ వ్యవస్థలో సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఒకే వ్యక్తికి ప్రధాని పదవిని రెండు పర్యాయాలకు పరిమితం చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళల ప్రాతినిధ్యం పెరుగు దల, ఎన్నికల సమయాల్లో తటస్థంగా వ్యవహరించే తాత్కాలిక ప్రభుత్వాల ఏర్పాటు సిఫార్సులను పొందుపరిచారు. ఈ రెఫరెండా నికి సంబంధించి తాజా ఎన్నికల్లో మెజార్టీ ప్రజలు మద్దతు పలికారు.

**బంగ్లా అధ్యక్షుడు అవుతారా?**

బంగ్లాలో బీఎస్పీ చీఫ్ రెహమాన్ నేతృత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వంలో యూనస్కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా యూనస్కు ఉన్న బలమైన సంబంధాల కారణంగా అధ్యక్షుడిగా ఎంచుకునే అవకాశం ఉందని స్థానిక రాజకీయాలను విశ్లేషించే డేవిడ్ బెర్గ్మన్ అనే కాలమిస్ట్ అంచనా వేశారు. ప్రపంచ స్థాయిలో ఆయనకున్న గుర్తింపు మరో బంగ్లాదేశీ నేతకు లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే బీఎస్పీ, మహ్మద్ యూనస్ మధ్య చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. యూనస్ ప్రతినిధి మాత్రం వాటిని తోసి పుచ్చారు. ఆయనకు రాజకీయాలపై అంతగా ఆసక్తి లేదన్నారు. సంక్షోభ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడిగా కొనసాగిన యూనస్ సేవలను తారిక్ రెహమాన్ ఉపయోగించు కునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నా రు. ముఖ్యంగా నూతన ప్రభుత్వానికి రాజకీయ లేదా ఆర్థిక అడ్వైజర్‌గా నియమించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. భవిష్యత్తుపై ప్రస్తుతానికి యూనస్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ.. బీఎస్పీ చేసే ప్రతిపాదనను అంగీకరించే అవకాశాలే ఎక్కువని తెలుస్తోంది.




# 3 రోజుల్లో 6 వేల మంది ఊచకోత

**- సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్ బలగాల మారణహోమం**

**- ఐక్యరాజ్యసమితి నివేదికతో వెలుగులోకి..**

కైరో: ఆఫ్రికా దేశం సూడాన్‌లో పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఫ్) బలగాలు దారుణానికి పాల్పడ్డాయి. గతేడాది అక్టోబరు చివర్లో డార్ఫర్ ప్రాంతంలో ఈ బృందాలు జరిపిన క్రూర మైన హింసాకాండలో మూడు రోజుల్లోనే 6 వేల మందికి పైగా మరణించారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. సూడాన్ పశ్చిమ ప్రాంతంలోని ఎల్-ఫాషర్ నగరాన్ని స్వాధీనం చేసుకోవ డంలో భాగంగా ఆర్ఎస్ఎఫ్ తీవ్రమైన యుద్ధ నేరాలకు పాల్పడిందని తెలిపింది. ఆర్ఎస్ఎఫ్, దాని అనుబంధ అరబ్ మిలిటెంట్లు 18 నెలల ముట్టడి అనంతరం గత అక్టోబరు 26న డార్ఫర్‌లో సూడన్ సైన్యానికి మిగిలిన ఏకైక బలమైన కోట ఎల్-ఫాషర్‌ను ఆక్రమించాయి. ఈ క్రమంలో ఎల్-ఫాషర్‌తో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయి. అక్టోబరు 25,27వ తేదీల మధ్య ఈ నగరంలో ఉంటున్న దాదాపు 4,400మందిని హతమార్చగా, పారిపోవ డానికి ప్రయత్నించిన మరో 1,600మందిని బలగాలు ఊచ కోత కోశాయి. ఇందులో సామూహిక హత్యలు, మరణశిక్షలు, లైంగిక హింస, అపహరణలు, నిర్బంధాలు తదితర దారుణాలకు పాల్పడినట్లు 29 పేజీల నివేదిక పేర్కొంది. వీటిలో చాలావరకూ దాడులు జాతి ఆధారంగానే జరిగాయని తెలిపింది. ఎల్-ఫాషర్‌లో సుమారు వారంరోజుల పాటు జరిగిన మారణకాండలో మృతు ల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగానే ఉండొచ్చని నివేదిక పేర్కొంది. అయితే ఈ నివేదికపై ఆర్ఎస్ఎఫ్ వర్గాలు స్పందిం చలేదు.

# సిమ్ కార్డుల నుంచి రూ.27 లక్షల బంగారం!



బీజింగ్: బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది లక్ష రూపాయల దిగువన ఉన్న 24 క్యారెట్ల బంగారం ధర.. ఇప్పుడు 1.50 లక్షలు రూపా యలు దాటింది. పేద, మధ్య తరగతి వాళ్లు బంగారం అన్న మాట వింటేనే భయపడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు మనం చెప్పుకోబోయే స్టోరీలో ఓ వ్యక్తి పారేసిన సిమ్ కార్డుల నుంచి ఏకంగా రూ.27 లక్షల విలువ చేసే బంగారం బయటికి తీశాడు. ఇందుకోసం అతడు చాలా కష్టపడ్డాడు. కష్టానికి తగిన ఫలితం దక్కింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రాంతానికి చెందిన క్వియావో అనే వ్యక్తి చెత్తను సేకరించి అమ్ముతుంటాడు. ఎలక్ట్రానిక్ వేస్ట్‌లో బంగారం ఉంటుందని అతడు తెలుసుకున్నాడు. బంగారం కోసం పాత సిమ్ కార్డులు, ఎలక్ట్రానిక్ చిప్స్‌ను సేకరించటం మొదలెట్టాడు. భారీ మొత్తంలో వేస్ట్ సేకరించిన తర్వాత.. వేస్ట్ నుంచి ఏకంగా 200 గ్రాముల బంగారం బయటకు తీశాడు. మార్కెట్‌లో ఆ బంగారం విలువ అక్షరాలా రూ.27 లక్షలు. ఎల క్ట్రానిక్ వేస్ట్ నుంచి బంగారం తీయడానికి క్వియావో చాలా కష్టపడ్డాడు. సాధారణంగా సిమ్ కార్డుల్లో అత్యంత తక్కువ బంగారం ఉంటుంది. ఒక్కో సిమ్ కార్డులో 0.001 మిల్లీ గ్రాముల బంగారం మాత్రమే ఉంటుంది. 200 గ్రాముల బంగారం తీయడానికి అతడు ఏకంగా నాలుగు లక్షల సిమ్‌లను సేకరించాడు. క్వియావోకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో.. ‘నాకు చిప్స్ నుంచి విలువైన లోహాలను వేరు చేయటం అంటే నాకు ఎంతో ఆసక్తి. నాలుగు లక్షల సిమ్ కార్డులను సేకరించి అత్యంత జాగ్రత్తగా వాటినుంచి బంగారం వేరు చేశా’ అని చెప్పుకొచ్చాడు.

చైతన్యరథం

# డ్రామా తేలిపోయింది..వార్ వన్‌సైడ్ అయిందిగా!






## సూపర్-8కి భారత్

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై భారత జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77) తుఫాన్ ఇన్నింగ్స్‌కు జతగా బౌలింగ్ విభాగం దుమ్ము రేపడంతో సూర్య సేన 61 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్ 'ఎ' నుంచి జట్టు సూపర్-8కి చేరింది. అంతేకాకుండా ఈ మెగా టోర్నీలో పాక్‌పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. 'మా బ్యాటర్లు కచ్చితంగా ఈ స్కోరును ఛేదిస్తారు'.. భారత్ ఇన్నింగ్స్ ముగిశాక స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ అన్న మాటలివి. కానీ బరిలోకి దిగాక పాక్ బ్యాటర్లు పోటీ కాదు కదా.. ఆ దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు. 0, 6, 4, 5 పాక్ టాప్-4 బ్యాటర్ల స్కోర్లివి. పేసర్లు హార్దిక్, బుమ్రాల ధాటికి తొలి రెండు ఓవర్లలోనే ముగ్గురు పెవిలియన్‌లో కూర్చోవడంతో పాక్ పరిస్థితి అర్థమైంది. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తున్నా ఓపెనర్ ఇషాన్ ధనాధన్ ఆటతీరుతో వహ్వా అనిపించాడు.

### నో షేక్‌హ్యాండ్..

ఆసియాకప్ సంప్రదాయాన్నే టీమిండియా ఇక్కడా కొనసాగించింది. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘాతో భారత సారథి సూర్యకుమార్ కరచాలనం చేయలేదు. ఇదే విషయమై మ్యాచ్‌కు ముందు రోజు ఇరు జట్ల కెప్టెన్లను విలేకరులు అడిగితే.. వేచి చూడాల్సిందిగా బదులిచ్చారు. అయితే మ్యాచ్ రోజు అందరూ ఆసక్తిగా గమనించినప్పటికీ ఎప్పటిలాగే ఎవరికి వారు ప్రజెంటర్‌తో మాట్లాడి వెళ్లిపోయారు. ఇదే ఆనవాయితీ అటు మహిళల వన్డే వరల్డ్‌కప్, అండర్-19 వరల్డ్‌కప్‌ల్లోనూ కొనసాగించిన విషయం తెలిసిందే.

### అతిరథుల సందడి

భారత్-పాక్ మ్యాచ్‌ను తిలకించేందుకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే తరలివచ్చారు. వీవీఐపీ గ్యాలరీలో ఆయనతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ, శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎఎల్‌సీ) అధ్యక్షుడు షమ్మి సిల్వ, పీసీబీ సీఓఓ సల్మాన్ నసీర్ కూడా ఉన్నారు. అయితే ఐసీసీ చైర్మన్ జైషా, టోర్నీ అంబాసిడర్ రోహిత్ శర్మ, ఐపీఎల్ చైర్మన్ ధూమల్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాత్రం వీళ్లతో కాకుండా మరో గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను తిలకించడం గమనార్హం.

**గ్రూప్-ఎ పాయింట్లు**

| జట్టు | ఆ | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| భారత్ | 3 | 3 | 0 | 6 | -3.050 |
| అమెరికా | 4 | 2 | 2 | 4 | -0.788 |
| పాకిస్థాన్ | 3 | 2 | 1 | 4 | -0.403 |
| నెదర్లాండ్స్ | 3 | 1 | 2 | 2 | -1.352 |
| నమీబియా | 3 | 0 | 3 | 0 | -2.443 |



### ఎన్ని డ్రామాలాడినా..

మ్యాచ్‌కు ముందు ఎంత డ్రామా! ఎన్ని రోజుల సస్పెన్స్! భారత్‌తో ఐసీసీ టోర్నీ మ్యాచ్ అనగానే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటుంది. భారత్‌తో మ్యాచ్ ఆడకుండే ఆర్థికంగా ఏర్పడే పరిణామాలు భయపెట్టిన వేళ పాకిస్థాన్ దిగివచ్చింది. కానీ మ్యాచ్ ఫలితం మాత్రం అదే. మిస్టరీ స్పిన్నర్ పేరిట ఉస్మాన్ తారిఖ్‌ను బరిలోకి దించినా, టీమిండియా బ్యాటర్లకు కళ్లెం వేసేందుకు మరో ఐదుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగినా వ్యూహం బెడిసి కొట్టింది. సూపర్ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లు పాక్ స్పిన్నర్లను ఆడేసుకున్నారు. స్లో బౌలర్లకు సహకరించిన ప్రేమదాస స్టేడియం పిచ్‌పై 176 పరుగుల లక్ష్యం క్లిష్టమైనదే. దాంతో ఛేదనలో మన స్పిన్నర్ల ఎదుట పాకిస్థాన్ పూర్తిగా తేలిపోయింది. బీసీసీఐకి ఐసీసీ పూర్తిగా లొంగిపోయిందంటూ, ఐసీసీకి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రికెట్ పాలన కు మరో సంస్థ రావాలంటూ బీరాలు పలికిన పాకిస్థాన్ చిత్తుగా ఓటమిపాలై చివరకు నవ్వుల పాలైంది.

# ఆస్ట్రేలియాకు మరో షాక్

**- సెంచరీతో నిశాంక విధ్వంసం**
**- శ్రీలంక ఘన విజయం**




టీ20 ప్రపంచ కప్‌లో శ్రీలంక సూపర్ -8కి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియాపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 181 పరుగులకు అలౌటైంది. అనంతరం శ్రీలంక కేవలం రెండు వికెట్లను మాత్రమే నష్టపోయి 19 ఓవర్లలోనే 184 పరుగులు చేసి గెలిచింది. శ్రీలంక ఓపెనర్ పాడుమ్ నిశాంక (100: 52 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సులతో ఈ టోర్నీలో తొలి సెంచరీ నమోదు చేశాడు. నిశాంక టీ20 కెరీర్లో ఇది రెండో శతకం కావడం గమనార్హం. కుశాల్ మెండిస్ (51) హాఫ్ సెంచరీ సాధించాడు. పవన్ రత్ననాయకె. (287) రాణించాడు. కుశాల్ పెరీరా (1) విఫలమయ్యాడు. ఆసీస్ బౌలర్లలో స్థాయినిస్ 2 వికెట్లు తీశాడు.

### వారిద్దరూ మినహా...

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 161 పరుగులకు అలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (54), ట్రావిస్ హెడ్ (50) హాఫ్ సెంచరీలతో రాణించారు. అయితే, కామెరూన్ గ్రీన్ (3), టిమ్ డేవిడ్ (6), మార్కస్ స్థాయినిస్ (4), కూపర్ (3) దారుణంగా విఫలమయ్యారు. జోష్ ఇంగ్లిస్ (27), గ్లెన్ మాక్స్వెల్ (22) ఓ మాదిరిగా రాణించడంతో కనీసం 180- స్కోరునైనా అందుకోగలిగింది.. చివరి ఓవర్‌లో రెండు రనౌట్లు సహా మూడు వికెట్లను ఆసీస్ కోల్పోయింది. శ్రీలంక బౌలర్లలో దుషాన్ హేమంత 3, చమీర, తీక్షణ, చునిత్, మెండిస్ తలో వికెట్. తీశారు.

### ఆసీస్ సూపర్ -8కి చేరుకోవాలంటే...

టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియా ఇప్పుడు కనీసం సూపర్ -8లో అడుగు పెట్టడమూ కష్టంగా మారింది. మూడు మ్యాచుల్లో కేవలం ఒక్క విజయం మాత్రమే సాధించిన ఆసీస్... తన చివరి పోరులో ఒమన్ ఫిబ్రవరి 20న తలపడనుంది. అందులో గెలిచినా.. సూపర్ -8కి అర్హత సాధిస్తుందనే నమ్మకం లేదు. మరోవైపు జింబాబ్వే ఇప్పటికే రెండు విజయాలు సాధించి రేసులో ముందుంది. ఆఖరి రెండు మ్యాచుల్లో ఒక్క విజయం నమోదు చేసినా జింబాబ్వే తదుపరి దశకు చేరుకుంటుంది.

# యూఏఈపై అఫ్ఘానిస్తాన్ ఘన విజయం



పొట్టి ప్రపంచ కప్ 2026లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. 161 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గాన్.. 19.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి ఈ టోర్నీలో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. సూపర్ 8 ఆశలు ఇంకా సజీవంగానే నిలుపుకుంది. అఫ్గాన్ బ్యాటర్లలో ఇబ్రహీం జర్దాన్(53; 41 బంతుల్లో 6 ఫోర్లు 1 సిక్స్) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఆఖర్లో అజ్మాతుల్లా రెహమాన్(40; 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రసూలీ(33) పర్వాలేదనిపించాడు. ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. యూఏఈ బౌలర్లలో జునైద్, అర్ఫాన్ చెరో 2, జవాదుల్లా 1 వికెట్ తీసుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. సోహైబ్ ఖాన్(68; 48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. అలీషాన్ షరాఫు(40) రాణించాడు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో అజ్మతు ల్లా ఒమర్జాయ్ 4 వికెట్లు తీసి యూఏఈ పతనాన్ని శాసించాడు. ముజీబుర్ రెహమాన్ 2, రషీద్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టారు. కాగా అటు బ్యాట్‌తో సంచలన ఇన్నింగ్స్ ఆడటంతో పాటు.. బంతితో 4 వికెట్లు తీసుకున్న అజ్మాతుల్లాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.




# ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్ విజయం

కోల్‌కతా: టీ20 ప్రపంచ కప్ 2026లో మరో సంచలనం కొద్దిలో తప్పింది. ఓ దశలో ఇంగ్లాండ్ కు ఇటలీ ఓటమి భయం చూపించింది. అయితే కీలక సమయంలో ఇంగ్లాండ్ బౌలర్లు రాణించడంతో 24 పరుగుల తేడాతో ఇటలీపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 202/7 స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (53: 22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు). కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఇటలీ సరిగ్గా 20 ఓవర్లలో 178 పరుగులకే ఆలౌటైంది. బెన్ మనెంటి (60) హాఫ్ సెంచరీ.. గ్రాంట్ స్టీవార్ట్ (45), జస్టిన్ మోస్కా (43) దూకుడుగా ఆడినా జట్టును గెలిపించలేకపోయారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమీ ఓవర్టన్ 3, సామ్ కరన్ 3, జోఫ్రా ఆర్చర్ 2.. విల్ జాక్స్, అదిల్ రషీద్ చెరో వికెట్ తీశారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ సూపర్ -8కి అర్హత సాధించింది.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 17 ఫిబ్రవరి 2026

# శివకార్తికేయన్.. సరసన భాగ్యశ్రీ బోర్సే



వరుస విజయాలతో దూసుకెళుతున్న హీరో శివకార్తికేయన్ సరసన టాలీవుడ్ నటి భాగ్యశ్రీ బోర్సే నటించనున్నారు. ఇందు కోసం ఆమెతో ఎన్ని సంప్రదిస్తున్నారు. 'తాయి కిళవి' దర్శ కుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్‌ను తాజాగా మదురైలో పూర్తి చేశారు. ఎస్కే హీరోగా నటిస్తూనే స్వయంగా నిర్మించనున్నారు. ఈ ప్రాజె క్టుపై ఎస్ పుట్టిన రోజైన ఈ నెల 17న అధికారికంగా వెల్లడించనున్నారు. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసేందుకు సంప్రదిస్తున్నట్లు సమాచారం. ఎస్కే సరసన నటించేందుకు సమ్మతిస్తే ఆమెకు ఇది తొలి తమిళ చిత్రం అవుతుంది. పైగా, సకాంత' చిత్రంలో తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచిన విషయం తెల్సిందే. మరోవైపు, పూర్తి గ్రామీణ నేపథ్యంలో రూపొందించే ఈ చిత్రాన్ని సింగిల్ షెడ్యూల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

# భుజానికి కీ-హోల్ సర్జరీ జరిగింది



ఇటీవల మెగాస్టార్ చిరంజీవి భుజానికి చిన్న ఆపరేషన్ జరిగింది. ఎక్స్ వేదికగా ఆయన ఈ విషయాన్ని షేర్ చేశారు. 'నా చేతికి కట్టు ఉండటం చూసి చాలా మంది శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ-హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను కోలుకుంటున్నా. నా రోజువారీ పనులు సాఫీగా సాగుతున్నాయి. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలతో సర్జరీ ప్రక్రియ సౌకర్యవంతంగా జరిగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉంది' అని ట్వీట్ లో పేర్కొన్నారు. అల్లు శిరీష్ వివాహం సందర్భంగా అల్లు అరవింద్ దంపతులు ఆహ్వాన పత్రిక ఇవ్వడానికి వెళ్లిన సందర్భంలో తీసిన ఫొటోల్లో చిరంజీవి చేతికి కట్టు కనిపించింది. అప్పటి నుంచి అభిమానులు బాస్ చేతికి ఏమైంది అంటూ ఆందోళన చెందారు. ఈ క్రమంలో చిరంజీవి సోషల్ మీడియా వేదిక ఈ విషయాన్ని తెలిపారు.

# రా అండ్ రస్టిక్ 'డానీ' ఫస్ట్ లుక్



ఆశీష్ గాంధీ హీరోగా కళ్యాణ్‌జి గోగణ తెరకెక్కించిన చిత్రం 'డానీ'. వెల్కమ్ టు లవ్ జంగిల్ ఆనంది ఉపశీర్షిక . రిజ్వాన్, ఖుషి సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటుగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. రా అండ్ రస్టిక్ గా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. హీరో రగ్డ్ లుక్, జుట్టు, గడ్డం, బాడీ, మెడలో మాల ఇవన్నీ మాస్ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యే పాత్రలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేసి జూన్ 26న సినిమా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రాకేందు మౌళి పాటల్ని రాయడమే కాకుండా సంగీతాన్ని అందించారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన ఇతర అప్డేట్‌లను ప్రకటించనున్నారు.

# వేసవి బరిలో... సినిమాలే సినిమాలు!



ఒకప్పుడు వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వరుస చిత్రాలు పోటీపడేవి. తమ అభిమాన హీరోలు నటించిన సినిమాలు చూడడం కోసం సినీ ప్రియులు మండుటెండను సైతం లెక్కచేయకుండా థియేటర్ల దగ్గర క్యూ కట్టేవారు. అయితే అగ్రహీరోలు పాన్ ఇండియా సినిమాలపై దృష్టిపెట్టడం, చిన్న.. మీడియం బడ్జెట్ చిత్రాలు విడుదలైనా అవి అంతగా అలరించకపోవడం.. ఇతర కారణాల వల్ల ఈ మధ్య వేసవి చిత్రాల హడావుడి తగ్గింది. కానీ ఈసారి వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రేక్షకులను అలరించడానికి వరుస చిత్రాలు సిద్ధమవుతున్నాయి.

**'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'...**

మార్చి 6న లావణ్య త్రిపాఠి నటించిన 'సతీ లీలావతి' విడుదల కానుంది. శివాజీ, లయ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని' మార్చి 6న ప్రేక్షకులను పలకరించనుంది. 'కోర్టు' జంట హర్ష్ రోషన్, శ్రీదేవీ మరోసారి మార్చి 13న 'బ్యాండ్ మేళం'తో అలరించనున్నారు. 'కేజీఎఫ్' సిరీస్‌తో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న యశ్ నటించిన చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న ఉగాది సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

అలాగే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాలీవుడ్ చిత్రం 'ధురంధర్' సీక్వెల్‌గా తెరకెక్కింది 'ధురంధర్ -2'. మార్చి 19న తెలుగులోనూ భారీ స్థాయిలో విడుదల కానుంది. పవన్‌కల్యాణ్ తన అభిమానులను 'ఉస్తాద్ భగత్‌సింగ్'తో అలరిండానికి సిద్ధమయ్యారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణను పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 26న విడుదలవుతోంది. రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలు.

**ఏప్రిల్‌లో.. వరుస చిత్రాలు**

'నారీ నారీ నడుమ మురారీ'తో హిట్ అందుకున్న శర్వానంద్ బైక్ రేసర్‌గా ప్రేక్షకులను పలకరించనున్నారు. ఏప్రిల్ 3న ఈ చిత్రం విడుదలవుతోంది. అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విక్రమ్ సమర్పిస్తున్నారు. 'మ్యాడ్' ఫేమ్ సంగీత్ శోభన్ నటిస్తున్న 'రాకాస' కూడా ఏప్రిల్ 3న విడుదలవుతోంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు.ఇక.. 'స్వయంభు'తో ప్రేక్షకులను పలకరించున్నారు నిఖిల్ సిద్ధార్థ. ఏప్రిల్ 10న విడుదలవుతోన్న ఈ పీరియాడిక్ యాక్షన్ చిత్రానికి భరత్‌కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మించారు. వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు పొందిన అడివి శేష్ 'డెకాయిట్'గా అలరించడానికి సిద్ధమయ్యారు. ఏప్రిల్ 10న చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. దర్శకుడు సుకుమార్, మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్‌కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదలవుతోంది. ఇదే వేసవిలో చిరంజీవి విశ్వంభర, వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న 'ఆదర్శ కుటుంబం', అడివి శేష్ నటిస్తున్న 'గూఢచారి 2', అఖిల్ 'లెనిన్', సాయి దుర్గాతేజ్ 'సంబరాల యేటి గట్టు', వరుణ్ తేజ్ 'కొరియన్ కనక రాజు', రవిబాబు 'రేజర్', విరాట్ కర్ణ 'నాగబంధం', తిరువీర్ భగవంతుడు చిత్రాలు విడుదల కావాల్సి ఉంది. అయితే వాటి విడుదల తేదీలపై త్వరలోనే స్పష్టత రానుంది.

# గొప్ప సినిమా అని చెప్పను..

## కానీ కనెక్ట్ అయ్యేలా సినిమా తీశాం




అర్జున్ సర్జా నటించి, దర్శక నిర్మాతగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. అర్జున్ కూతురు ఐశ్వర్య అర్జున్, ఉపేంద్ర అన్న కొడుకు నిరంజన్‌ని వెండి తెరకు పరిచయమయ్యారు. ఫిబ్రవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. తాజాగా చిత్ర బృందం థాంక్యూ మీట్ నిర్వహించింది. అర్జున్ మాట్లాడుతూ 'సీతా పయనం' కథ గ్రాటిట్యూడ్, థ్యాంకింగ్‌కి సంబంధించింది. పదమూడేళ్ల క్రితం నేను చూసిన యాక్సిడెంట్‌తో ఈ లైన్ తట్టింది. ఒక పది సెకన్లు వెనకా ముందు అయినా కూడా ఆ యాక్సిడెంట్ జరిగేది కాదు. అలా అక్కడి నుంచి ఈ ఐడియా పుట్టింది. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ తమ జీవితాన్ని చూసినట్టుగా ఉందని అంటున్నారు. చెడులోనూ మంచి ఉంటుందని ఇందులోని పాత్రలు రియలైజ్ అవుతుంటాయి. ప్రతిఒక్కరి జీవితం ఒక జర్నీ లాంటిదే. నాకు నటన అంటే ఏంటో తెలియకుండానే సినిమాల్లోకి వచ్చాను. ఆ తరువాత యాక్టింగ్ నేర్చుకున్నాను. దర్శకత్వం చేశాను. 'జెంటిల్‌మెన్'తో స్టేట్ బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. ఆ తరువాత మళ్లీ బాధ్యత పెరిగినట్టు అయింది. నా కూతురు అద్భుతంగా నటించింది అని ప్రశంసిస్తున్నారు. నేను అక్కడే పాస్ అయ్యాను. గొప్ప సినిమా తీశానని చెప్పను కానీ మేం ఏం అనుకున్నామో అది జనాలకు కనెక్ట్ అయ్యేలా తీశాం. కెమెరా మెన్, మ్యూజిక్ డైరెక్టర్, డైలాగ్ రైటర్ ఈ సినిమాకి ప్రధాన బలం. ఎంతో నిజాయితీతో ఈ మూవీని తీశాం' అన్నారు.

**'సీతా పయనం' చాలా ప్రత్యేకం**

ఐశ్వర్య అర్జున్ మాట్లాడుతూ 'సీతా పయనం' మా అందరికీ చాలా ప్రత్యేకం. ఆడియెన్స్ ఇస్తున్న ప్రేమను చూస్తే ఇది మాకు మరింత స్పెషల్‌గా మారింది' అన్నారు. నిరంజన్ మాట్లాడుతూ 'ఎంతో కష్టపడి సినిమా చేశాం. ఇది ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ చిత్రం. నాకు ఇంత మంచి పాత్రని, సినిమాను ఇచ్చిన అర్జున్ గారికి థాంక్స్. ఎన్నో విలువలతో తీసిన ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుంది. ఐశ్వర్యతో పని చేయడం సంతోషంగా ఉంది. మాకు అన్ని చోట్లా మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. ఇలానే మా సినిమాని ఆదరిస్తూ ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ 'ఇలాంటి స్టోరీతో సినిమా చేయాలంటే చాలా గట్స్ ఉండాలి. జనాలకు ఓ మంచి సినిమా ఇవ్వాలనే ఆలోచనతో అర్జున్ గారు ఈ మూవీని తీశారు. ప్రతీ ఒక్కరి జీవితంలో గ్రాటిట్యూడ్ అనేది ఉండాలి. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తీసిన ఇలాంటి చిత్రాలే ప్రస్తుతం అవసరం. నా పాటలు, బీజీఎం గురించి అందరూ మాట్లాడు తున్నారు' అని అన్నారు.